

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


సబ్సిడీపై పశుదాణా పంపిణీ చేసిన ఏ డి వెంకటేశ్వర్లు



4లో


Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 158 పేజీలు - 08 వెల - 05/- ఆదివారం 07-06-2026


## బొద్దింకలు రోడ్డెక్కలేవన్నారు, ఇదిగో వచ్చేశాం:

# జంతర్ మంతర్‌లో అభిజీత్



- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ తొలి నిరసన
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఫలితాల అవకతవకలపై ఆందోళన



*దేశవ్యాప్త విద్యా వ్యవస్థలో వేదికగా సంచలనం సృష్టించిన నెలకొన్న సమస్యలపై యువత 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) గళమెత్తింది. సోషల్ మీడియా శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తొలిసారిగా ప్రత్యక్ష నిరసన కార్యక్రమం చేపట్టింది. "బొద్దింకలు రోడ్డెక్కలేవన్న వారికి సమాధానంగానే మేము ఇక్కడికి వచ్చాం" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నీట్-యూజీ పేపర్ లీక్, సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో దొర్లిన అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన నిర్వహించారు.*

**ఈ నిరసనలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా పాల్గొన్నారు.**

కొద్దిరోజుల క్రితం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యువతలో కొందరిని ఉద్దేశించి 'బొద్దింకలు', 'పరాన్నజీవులు' అని చేసిన వ్యాఖ్యలకు వ్యంగ్య స్పందనగా ఈ పార్టీ ఆవిర్భవించింది. బోస్టన్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన అభిజిత్ దీప్కే, ఈ అవమానాన్ని యువత నిరాశకు, నిరుద్యోగానికి ప్రతీకగా మార్చి ఆన్‌లైన్‌లో ఉద్యమాన్ని ప్రారంభించారు. అనతికాలంలోనే లక్షలాది మంది మద్దతుదారులను సంపాదించుకున్న ఈ ఉద్యమం, ఇప్పుడు క్షేత్రస్థాయి పోరాటంగా రూపాంతరం చెందింది.

మిగతా 2లో

## జంతర్ మంతర్‌ను కదిలించిన యువత.

**'కాక్రోచ్ జనతా పార్టీ'పై ఫిర్యాదు**

● నీట్, సీబీఎస్ఈ అవకతవకలపై ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ● కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, యువకులు ● నిర్వాహకుడు అభిజీత్ దీప్కేపై దేశ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలతో ఫిర్యాదు ● విదేశీ నిధులతోనే ఈ నిరసన చేపట్టారని ఫిర్యాదులో ఆరోపణలు




2

**విజయ్ ప్రభుత్వ ఏర్పాటు వెనుక..అసలు కారణం**

## చెప్పిన స్టాలిన్



- రాష్ట్రపతి పాలనను అడ్డుకోవడానికే విజయ్ ప్రభుత్వానికి మద్దతిచ్చామని చెప్పిన స్టాలిన్
- గవర్నర్ ద్వారా బీజేపీ జోక్యాన్ని నివారించడమే లక్ష్యమని వెల్లడి
- 108 సీట్లు గెలిచిన టీవీకేకు కాంగ్రెస్, ఇతర మిత్రపక్షాల మద్దతుతోనే అధికారం

తమిళనాడులో రాష్ట్రపతి పాలనను నివారించేందుకే, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ ఏర్పాటుకు తమ మిత్రపక్షాలు మద్దతివ్వడానికి అనుమతించామని డీఎంకే అధినేత, మిగతాది 2లో

# జీరో లిక్విడ్ డిశ్చార్జి

## పంచాయతీలతో గోదావరి పుష్కరాలకు మరింత శోభ

మ్యాజిక్ డ్రెయిన్లతో మంచి ఫలితాలు

- పంచాయతీల నుంచి మురుగు నీరు నదిలోకి కలవకూడదు
- ప్రతి పంచాయతీలోనూ ప్రత్యేక ప్రణాళిక అవసరం
- మునికూడలి పుష్కర ఘాట్ ను మోడల్ గా తీర్చిదిద్దుతాం
- మునికూడలి ఘాట్ కి సప్తర్షి పుష్కర్ ఘాట్ గా నామకరణం



2

'గోదావరి పుష్కరాలను స్వచ్ఛంగా, శుభ్రంగా నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ తపన. ఇందుకు అనుగుణంగా గోదావరి పుష్కరాలకు ఆతిథ్యం ఇచ్చే 268 గ్రామ పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దుతాం. పంచాయతీల నుంచి వచ్చే మురుగు నీరు చుక్క కూడా గోదావరిలోకి కలవడకుండా చర్యలు తీసుకోవాలి. జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలుగా తీర్చేదిద్దే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలి. ఇందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేయాల'ని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులను ఆదేశించారు. గోదావరి మోడల్ పుష్కర్ పంచాయతీ ప్రణాళికపై శనివారం గోదావరి పుష్కరాలకు సంబంధించిన జిల్లా కలెక్టర్లతో, పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

## టీఎంసీకి గుడ్ బై చెప్పిన మైనారిటీ నేత



● టీఎంసీకి రాజీనామా చేసిన రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అజ్మల్ సిద్ధిఖీ ● అభిషేక్ బెనర్జీ నియంతృత్వ వైఖరే కారణమని తీవ్ర ఆరోపణలు ● ఒక్క అభిషేక్ వల్లే పార్టీ కుప్పకూలుతోందని సంచలన వ్యాఖ్యలు

పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం సంక్షోభంలో చిక్కుకున్న తృణమూల్ కాంగ్రెస్‌కు (టీఎంసీ) మరో భారీ షాక్ తగిలింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నాయకత్వ శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, మిగతాది 2లో

## టీచర్లు లేని స్కూల్, స్మార్ట్ ట్రాఫిక్

: ఏపీ కోసం రష్యాలో లోకేష్ కీలక భేటీలు



2

● ఏపీ యువత భవిష్యత్తే లక్ష్యం ● రష్యాలో మంత్రి నారా లోకేష్ కీలక భేటీలు ● సంక్షోభంలోనూ అవకాశాలు సృష్టించడమే నాయకత్వమన్న లోకేష్ ● ప్రవాస భారతీయులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారి అభివృద్ధిలో భాగం కావాలని పిలుపు

# సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



తాడేపల్లి/అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, సేంద్రీయ ఉత్పత్తులతో మానవాళి ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. ప్రస్తుతం సేంద్రీయ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉందని, రైతులకు అధిక లాభాలు కూడా వస్తున్నాయని అన్నారు. తాడేపల్లిలోని ఎఎస్పార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్నిమంత్రి సవిత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. ప్రకృతి సాగుతో పర్యావరణానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకంతో వ్యవసాయ దిగుబడి పెరగొచ్చునేమో కాని, వాటి వినియోగంతో క్యాన్సర్, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వినియోగంపై ప్రజల్లోనూ చైతన్య పెరుగుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ లో అధిక డిమాండ్ ఉందని, మిగతాది 2లో

**మిత్రదేశంపైనే**

## గూఢచర్యం.. ఇజ్రాయెల్‌పై అమెరికాకు అనుమానాలు?



2

- ఇజ్రాయెల్ గూఢచర్యంపై పెంటగాన్ అనుమానాలు
- ఉన్నతాధికారులపై నిఘా పెట్టే అవకాశం ఉందని హెచ్చరిక
- ఇజ్రాయెల్ పర్యటనలో బర్నర్ ఫోన్లు వాడాలని అధికారులకు సూచన
- ఇరాన్ వివాదంలో ట్రంప్, నెతన్యాహు విభేదాలే కారణం

## మేం పన్నులు కట్టి ఢిల్లీకి సలాం కొట్టాలా?

● మేం అనుమతుల కోసం వెళ్తే...గుజరాత్ రమ్మంటున్నారు ● చిత్తశుద్ధి ఉంటే యూపీలో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయండి ● పెట్టుబడుల్ని బలవంతంగా గుంజుకుంటున్నారు ● ఉత్తరాది, దక్షిణాది అంతరాలు పెంచొద్దు

● త్వరలో చైనాకు వెళ్లి నేర్చుకుంటా..




హైదరాబాద్ "మేం పన్నులు కట్టి ఢిల్లీకి సలాం కొట్టాలా? పనిచేసే రాష్ట్రాలను శిక్ష?ంచొద్దు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి ఎక్కువ ఆదాయం ఇస్తూ, తక్కువ తీసుకుంటున్నాయి. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర హోం శాఖ మంత్రి అంతా ఉత్తరాది రాష్ట్రాలవారే. ప్రజల్లో ప్రాంతాల మధ్య ఇలాంటి అంతరాలు పెంచొద్దు. బీజేపీ ప్రతిపాదించినట్టు పార్లమెంటులో సీట్ల సంఖ్యను పెంచితే ఈ అంతరాలు మరింత పెరుగుతాయి. కేరళలో లోక్‌సభ సీట్లు 20 నుంచి 30కి పెరిగితే ఉత్తరప్రదేశ్‌లో 80 నుంచి120 పెరుగుతాయి.. ఇది సరైంది కాదు. దీన్నే మేం వ్యతిరేకిస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మహిళా రిజర్వేషన్ల పేరుతో రాజకీయ జిమ్మిక్కులు చేస్తున్నారు. పార్లమెంట్ సీట్ల పెంపును మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపెట్టడాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. నిజంగానే కేంద్రానికి మహిళా రిజర్వేషన్ల అమలుపై చిత్తశుద్ధి ఉంటే 2027లో ఉత్తరప్రదేశ్ ఎన్నికలు వస్తున్నాయి. అక్కడ ఆ బిల్లును అమలు చేయాలి" అని సీఎం ఏ రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఫైర్ అయ్యారు. బీజేపీ విధానాలు, ప్రధాని మోడీ వైఖరి సరైనవి కావని స్పష్టం చేశారు. శనివారం బెంగుళూరులో ది హిందూ ఆంగ్ల దినపత్రిక నిర్వహించిన 'హడ్లీ-2026' లో ఆ గ్రూప్ డైరెక్టర్ ఎన్ రామ్ అడిగిన అనేక ప్రశ్నలకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానాలు చెప్పారు. మిగతాది 2లో

# ‘సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం

వాటి వల్ల రైతులకు అధిక లాభాలు ఆర్జిస్తున్నారని



తెలిపారు. ప్రతి ఒక్కరూ సేంద్రీయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, రసాయన ఎరువులు, పురుగుల మందులు లేని సాగును సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సేంద్రీయ సాగు చేస్తున్న ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్ర నిర్వాహకులను, రైతులను మంత్రి సవిత అభినందించారు.

**సైకిల్ పై వచ్చి... చలివేంద్రం దగ్గర మజ్జిగ తాగి..**

అంతకుముందు తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అయిదు కిలో మీటర్ల దూరంలో ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రానికి మంత్రి సవిత సైకిల్ పై వెళ్లారు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. సేంద్రీయ పద్ధతులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. సేంద్రీయ ఎరువుల తయారీని కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ క్షేత్రంలో సాగవుతున్న ఉత్పత్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్న సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ శాలను కూడా మంత్రి సందర్శించారు. ఆయా ఉత్పత్తులు ధరలు అడిగి తెలుసుకుని, మంత్రి సవిత కూడా కొనుగోలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలో జామ పండను రుచి చూశారు. తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ నే వినియోగించారు. మార్గమధ్యంలో పాతూరు రోడ్డు వద్ద ఉన్న చలివేంద్రం వద్ద ఆగి, మజ్జిగ తాగి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి, ఎఎస్సార్ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం నిర్వాహకుడు సామిరెడ్డి, కూటమి నాయకులు రాజశేఖర్, కొమ్మారెడ్డి కిరణ్ సహా కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# టీఎంసీకి గుడ్ బై చెప్పిన మైనారిటీ నేత

రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి మహమ్మద్ అజ్మల్ సిద్ధిఖీ శనివారం పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేశారు. ఇటీవలే హజ్ యాత్ర ముగించుకుని వచ్చిన సిద్ధిఖీ, తన రాజీనామా లేఖను టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి పంపారు. పార్టీలో ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడిందని, నిబద్ధత గల కార్యకర్తలను విస్మరిస్తున్నారని ఆయన ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాతే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రాజీనామా అనంతరం సిద్ధిఖీ మాట్లాడుతూ అభిషేక్ బెనర్జీపై సంచలన ఆరోపణలు చేశారు. “ప్రస్తుతం పార్టీ కుప్పకూలుతోందంటే దానికి అభిషేక్ బెనర్జీయే ప్రధాన కారణం. ఆయన నియంతృత్వ ధోరణి, అధికార కేంద్రీకరణ వల్ల నిజాయతీ గల కార్యకర్తలకు అన్యాయం జరుగుతోంది. వారి అభిప్రాయాలకు పార్టీలో విలువ లేకుండా పోయింది” అని విమర్శించారు. పాత కేసులు, ఇతర ఒత్తిళ్ల కారణంగా పార్టీలో కొనసాగలేని పరిస్థితులు నెలకొన్నాయని, రాజీనామా తర్వాత ప్రస్తుతం తాను ఎంతో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ పరాజయం పాలైన నేపథ్యంలో, పార్టీలో అంతర్గత విభేదాలు, అసమ్మతి స్వరాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఈ తరుణంలో మైనారిటీ విభాగంలో కీలక నేతగా ఉన్న సిద్ధిఖీ రాజీనామా చేయడం పార్టీకి మరింత నష్టం కలిగించే పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలతో గోదావరి పుష్కరాలకు మరింత శోభ

జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలుగా తీర్చేదిద్దే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలి. ఇందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేయాల’ని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులను ఆదేశించారు. గోదావరి మోడల్ పుష్కర్ పంచాయతీ ప్రణాళికపై శనివారం గోదావరి పుష్కరాలకు సంబంధించిన జిల్లా కలెక్టర్లతో, పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ... “గోదావరి పుష్కర ఘాట్లు, పుష్కర నగర్ ల వద్ద ఏర్పాట్లు, సౌకర్యాల విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం. ముఖ్యంగా కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణ అనేది లక్ష్యంగా పెట్టుకొని ముందుకు వెళ్తున్నాం. ఇందుకు అనుగుణంగా పని చేయండి. పుష్కర నగర్ల వద్ద పార్కింగ్, వీధి దీపాలు, వస్త్రాలను మార్చుకునే గదులు, జల్లు స్నానాలు, రోడ్లు, డ్రెయిన్లు, ఆలయాలు, ఇతర ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండేలా చూడండి. వాహనాల నిలుపుదలకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను ప్రత్యేకంగా ఇవ్వండి. ఏ ప్రాంతం వైపు నుంచి వచ్చే వారు ఆ ప్రాంతంలోనే స్నానాలను ఆచరించి వెళ్లేలా చూడండి. ఘాట్ వెడల్పు, వచ్చే జనంపై ముందస్తు అంచనా అనేది చాలా ముఖ్యం. అవసరం అయితే వచ్చే భక్తులను బట్టి ఘాట్ వెడల్పు పెంచుకునే వెసులుబాటును ముందస్తుగానే ఉంచుకోండి.

**పంచాయతీల నుంచి చుక్క మురుగు నీరు గోదావరిలో కలవకూడదు**

గోదావరిలోకి మురుగు నీరు కలవకుండా పక్కా చర్యలు తీసుకోవాలి. పంచాయతీల మురుగు నీటి వ్యవస్థను సరిదిద్దాలి. పుష్కరాలకు సంబంధించిన పంచాయతీల్లో సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రెయిన్ల ద్వారా మురుగు నీటిని సమూలంగా అరికట్టేలా పంచాయతీలవారీగా ప్రణాళికను సిద్ధం చేయండి. గోదావరిలోకి పంచాయతీల నుంచి చుక్క మురుగునీరు కూడా రాకుండా చేయాలి. దీనికి సంబంధించి ఏ పనులు చేయాలి..? ఎంత ఖర్చు అవుతుంది..? అనే ప్రణాళికను వెంటనే చూసుకోవాలి. ప్రధాన ఘాట్లలో గోదావరికి హారతి కార్యక్రమం గురించి దేవాదాయ శాఖను సమన్వయం చేసుకొని ఆలయాల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయండి. మ్యాజిక్ డ్రైన్ల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. పంచాయతీల్లో మురుగు నీరు కనిపించకుండా ఈ డ్రైన్లు చేస్తున్నాయి.

**మునికూడలి ఘాట్ జాతీయ స్థాయి మోడల్ కావాలి**

సీతానగరం వద్ద ఉన్న మునికూడలి ఘాట్ ను జాతీయ స్థాయి మోడల్ ఘాట్ గా తీర్చిదిద్దాలన్నది లక్ష్యం. ?మునికూడలి ఘాట్ కి సప్తర్షి పుష్కర్ ఘాట్ పేరిట తీర్చిదిద్దాలి.

80 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఘాట్ లో 75 వేల మంది పుష్కర స్నానం చేసేందుకు అనువుగా ఉంటుంది. ఈ ఘాట్ వద్ద అవసరం అయిన అన్ని ఏర్పాట్లను పక్కాగా చేయండి. పార్కింగ్ కోసం రైతుల పొలాలను ఉపయోగించినా, మట్టి తీసినా పార్కింగ్ ఫీజులో వారికి వాటా ఇచ్చేలా ప్లాన్ చేయండి. వారి అనుమతి తీసుకొని పుష్కరాలకు వారి సహాయసహకారాలతోనే ముందుకు వెళ్దాం. ఈ ఘాట్ వద్ద సోమేశ్వరాలయం, వేణుగోపాల స్వామి ఆలయాలున్నాయి. వీటిని ఆధునీకరించే పనులు వేగవంతం చేయండి. నేను ఈ నెలలో జరగనున్న కేబినెట్ సమావేశం తర్వాత మునికూడలి ఘాట్ ను సందర్శిస్తాను. చేయాల్సిన పనులను స్వయంగా పరిశీలిస్తాను. సమష్టిగా పనిచేసి పుష్కరాల నిర్వహణలో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలి” అన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీ కృష్ణతేజ, ఓఎస్డీ శ్రీ వెంకటకృష్ణ ఉన్నారు.

# విజయ్ ప్రభుత్వ ఏర్పాటు వెనుక... అసలు కారణం చెప్పిన స్టాలిన్

తమ మిత్రపక్షాలు మద్దతివ్వడానికి అనుమతించామని డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ ద్వారా బీజేపీ జోక్యాన్ని అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శనివారం చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు. 2026 ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకు గాను టీవీకే 108 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మెజారిటీని ఆ పార్టీ సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో డీఎంకే కూటమిలోని సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలతో పాటు, కూటమి నుంచి విడిపోయిన కాంగ్రెస్ (5 సీట్లు) మద్దతుతో టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మిత్రపక్షాలు టీవీకేకు మద్దతిస్తామని తనను సంప్రదించినప్పుడు, అది వారి ప్రజాస్వామ్య హక్కు అని భావించి తాను అడ్డుకోలేదని స్టాలిన్ వివరించారు. డీఎంకే అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో గెలిచిన తమ మిత్రపక్షాల మద్దతుతోనే ప్రస్తుతం టీవీకే ప్రభుత్వం నడుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తమ పార్టీని నిరుత్సాహపరచలేదని, ప్రతిపక్షంలో ఉంటూనే ప్రజలకు సేవ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# జంతర్ మంతర్‌ను కదిలించిన యువత...

నీట్-యూజీ 2026 పేపర్ లీక్, సీబీఎస్ఈ ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) మూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికింది. ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సీజేపీ) ఆధ్వర్యంలో నేడు జంతర్ మంతర్ వద్ద వేలాది మంది యువత భారీ నిరసన చేపట్టారు. అయితే, ఈ నిరసన పూర్తయిన వెంటనే, సంస్థ నిర్వాహకులపై దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ ఫిర్యాదు దాఖలైంది. సీజేపీ వ్యవస్థాపకుడు, బోస్టన్ యూనివర్సిటీ విద్యార్థి అయిన అభిజీత్ దీప్కే నేతృత్వంలో ఈ నిరసన జరిగింది. ఢిల్లీ పోలీసుల అనుమతితోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో వేలాది మంది పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు యువ వృత్తి నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు, బ్యానర్లతో నినాదాలు చేశారు. ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా ఈ నిరసనకు హాజరై తన మద్దతును ప్రకటించారు. ఈ నిరసన తర్వాత అభిజీత్ దీప్కేపై కేసు నమోదైంది. అతడు అమెరికా నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఈ నిరసనను నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. విదేశీ నిధులతోనే ఈ నిరసనను చేపట్టారని, దీని వెనుక దేశ వ్యతిరేక కార్యకలాపాలు ఉన్నాయని ఫిర్యాదులో ఆరోపించారు. గత నెలలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కోర్టు విచారణ సందర్భంగా యువతలో కొందరిని ఉద్దేశించి ‘బొద్దింకలు’, ‘పరాన్నజీవులు’ అని సంబోధించారు. ఈ వ్యాఖ్యలకు వ్యంగ్యాస్త్రంగా అభిజీత్ దీప్కే ‘కాక్రోచ్ జనతా పార్టీ’ని సోషల్ మీడియాలో ప్రారంభించారు. అనతికాలంలోనే ఈ సంస్థకు 22 మిలియన్ల మంది ఫాలోవర్లు చేరారు. యువత సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ ఉద్యమం సాగుతోంది. నిరసన నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేశారు. సరిహద్దులు, విమానాశ్రయం వద్ద నిఘా పెంచడంతో పాటు సోషల్ మీడియా, క్యాబ్ సర్వీసులపై కూడా అధికారులు దృష్టి సారించారు.

# బొద్దింకలు రోడ్డెక్కలేవన్నారు, ఇదిగో వచ్చేశాం: జంతర్ మంతర్‌లో అభిజిత్

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యారంగ డిజిటలైజేషన్ లోపాలను సరిదిద్దడం, విద్యార్థులపై మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు చేపట్టడం వంటివి తమ ప్రధాన డిమాండ్లని నిరసనకారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఢిల్లీ పోలీసులు వెయ్యి మందికి పైగా సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుజాగ్రత్త చర్యగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

# మిత్రదేశంపైనే గూఢచర్యం.. ఇజ్రాయెల్‌పై అమెరికాకు అనుమానాలు?

అమెరికా రక్షణ శాఖ నిఘా సంస్థ (డీఐఏ) ఇటీవల అంతర్గతంగా ఒక హెచ్చరిక నోటీసును జారీ చేసింది. ఇజ్రాయెల్ తమ దేశ ఉన్నతాధికారులపై నిఘా వేసిందన్నది దాని సారాంశం. పశ్చిమాసియా వివాదాలపై అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం తీసుకునే అంతర్గత నిర్ణయాలను దొంగిలించడానికి ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోందని పెంటగాన్ అనుమానిస్తోంది. ఎన్‌బీసీ న్యూస్ ఈ షాకింగ్ నిజాలను బయటపెట్టింది. ఈ తాజా నివేదిక నేపథ్యంలో ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లే యూఎస్ అధికారులకు నిబంధనలను కఠినతరం చేశారు. ఉన్నత స్థాయి చర్చల కోసం వెళ్లేవాళ్లు సాధారణ ఫోన్లకు బదులుగా ‘బర్నర్ ఫోన్లు’, తాత్కాలిక కంప్యూటర్లను మాత్రమే వాడనున్నారు. హోటల్ గదుల్లో ఎలాంటి సున్నితమైన విషయాలను మాట్లాడొద్దని సూచించారు. ఇజ్రాయెల్ నిఘా సంస్థలు సమాచారాన్ని సేకరించడంలో చాలా దూకుడుగా వ్యవహరిస్తాయని ఇప్పటికే పేరుంది. అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఇరాన్ యుద్ధంపై వస్తున్న విభేదాలే ఈ తాజా వివాదానికి కారణం. ఇటీవల ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ తర్వాత ట్రంప్ దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నారు. కానీ ఇరాన్‌పై మళ్లీ సైనిక దాడులు చేయాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పట్టుబడుతున్నారు. ఇటీవల వీరిద్దరి మధ్య జరిగిన ఓ ఫోన్ సంభాషణలో ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, నెతన్యాహును పిచ్చివాడు అని సంబోధించారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ గూఢచర్య ఆరోపణలను వాషింగ్టన్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం తోసిపుచ్చింది. తమపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వివరించింది. ఇజ్రాయెల్ ఎప్పుడూ అమెరికా ప్రభుత్వ అధికారులపై నిఘా పెట్టదని, తమ శత్రువులపై మాత్రమే నిఘా ఉంచుతుందని పేర్కొంది. అటు వైట్ హౌస్ కూడా ఈ వార్తలను అధికారికంగా ఖండించింది. అయినప్పటికీ ఇరుదేశాల మధ్య అంతర్గతంగా నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# టీచర్లు లేని స్కూల్, స్మార్ట్ ట్రాఫిక్

అమరావతి, విశాఖలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం యాండెక్స్ సంస్థతో కీలక చర్చలు

“సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వం. ఆంధ్రప్రదేశ్ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే అవకాశాలను సృష్టించేందుకే నేను రష్యాలో పర్యటిస్తున్నాను,” అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. తన రష్యా పర్యటనలో ఐదో రోజు ఆయన మాస్కోలో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. పెట్టుబడుల ఆకర్షణ, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీకి తీసుకురావడమే లక్ష్యంగా పలు సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు.

**ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశం**

మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో జరిగిన ప్రవాస భారతీయుల (డయాస్పోరా) సమావేశంలో లోకేష్ ఉద్విగ్నభరితంగా ప్రసంగించారు. “మీరు భారతదేశాన్ని విడిచి వచ్చినా, భారతదేశం మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టదు. మాతృభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా, మన సంస్కృతి, సంప్రదాయాలను గుండెల్లో మోస్తున్న మీ విజయాలు దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నాయి” అని ఆయన ప్రశంసించారు. భారత్-రష్యా బంధం అత్యంత విశ్వసనీయమైనదని, ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ నాయకత్వంలో ఈ స్నేహం మరింత బలపడిందని అన్నారు. అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోదీ దేశ కీర్తిప్రతిష్టలను చారిత్రక శిఖరాలకు చేర్చారని కొనియాడారు.

**అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కండి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని లోకేష్ వివరించారు. “యువ జనాభా, సుదీర్ఘ తీరప్రాంతం, ఆధునిక ఓడరేవులు మన బలం. పెట్టుబడులను ఆకర్షించి, వాటిని యువతకు ఉపాధిగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం,” అని ఆయన తెలిపారు. గత రెండేళ్లలో ఏపీ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి ఏరోస్పేస్ వరకు అనేక రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. “మీరంతా ఏపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఒక్క పెట్టుబడి తీసుకురండి, యువతకు ఉద్యోగాలివ్వండి. మీకు ఏ సమస్య వచ్చినా ఏపీఎన్నార్టీ అండగా ఉంటుంది, ఆ బాధ్యత నాది,” అని లోకేష్ భరోసా ఇచ్చారు. బలమైన భారత్ కోసం ‘నమో’ (నరేంద్ర మోదీ) అయితే, బలమైన ఆంధ్రప్రదేశ్ కోసం ‘నమో’ (నాయుడు-మోదీ) కలయిక పనిచేస్తోందని ఆయన అభివర్ణించారు.

**అమరావతి, విశాఖకు స్మార్ట్ ట్రాఫిక్ సొబగులు**

పర్యటనలో భాగంగా, రష్యాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ యాండెక్స్ (ఘఅఎవఝ) ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. అమరావతి, విశాఖపట్నం నగరాల్లో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, కంప్యూటరైజ్డ్ పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్ అమలుపై చర్చించారు. లాస్ట్-మైల్ రవాణా ఖర్చులను తగ్గించేందుకు యాండెక్స్ అటానమస్ వాహనాలు, ప్రిడిక్టివ్ రూటింగ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని సూచించారు.

**విశాఖ కేంద్రంగా ఫార్మా ఎగుమతులు**

విశాఖపట్నాన్ని రష్యా, కామన్వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్ (జ×ూ) మార్కెట్లకు ఎగుమతుల హబ్‌గా మార్చడమే లక్ష్యమని లోకేష్ తెలిపారు. మాస్కోలో ఆర్ఎంఎం ఫార్మా డైరెక్టర్ ముఖేష్ కుమార్‌తో భేటీ సందర్భంగా, విశాఖలో ఆ సంస్థ నిర్మిస్తున్న యూనిట్ పనులను వేగవంతం చేయాలని కోరారు. విశాఖలో రూ.200 కోట్ల వ్యయంతో, 300 మందికి ఉపాధి కల్పించేలా తమ యూనిట్ నిర్మాణం జరుగుతోందని, 2027 మార్చి నాటికి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభిస్తామని ముఖేష్ కుమార్ వివరించారు.

**టీచర్లు లేని ‘స్కూల్ 21’ పై ఆసక్తి**

ఈ పర్యటనలో మరో ముఖ్యమైన ఘట్టం, మాస్కోలోని వినూత్న పాఠశాల ‘స్కూల్ 21’ను సందర్శించడం. స్బేర్ బ్యాంక్ ఆధ్వర్యంలో నడిచే ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధికారిక తరగతులు ఉండవు. విద్యార్థులు ప్రాజెక్ట్ ఆధారిత పనుల ద్వారా ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటారు. ఇక్కడ ప్రవేశానికి గత విద్యార్హతలతో సంబంధం లేకుండా, సమస్య పరిష్కార నైపుణ్యాల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈ విద్యా విధానంపై లోకేష్ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. నిర్వాహకులు, విద్యార్థులతో మాట్లాడి, అక్కడి పద్ధతులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఏపీలో విద్యా సంస్కరణలకు ఈ మోడల్ ఎంతవరకు ఉపయోగపడుతుందనే కోణంలో అధ్యయనం చేశారు. మొత్తం మీద, మంత్రి లోకేష్ రష్యా పర్యటన కేవలం పెట్టుబడులకే పరిమితం కాకుండా, విద్య, సాంకేతికత, నగరాభివృద్ధి వంటి కీలక రంగాల్లో నూతన భాగస్వామ్యాలను నిర్మించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ చిత్రపటాన్ని మార్చే దిశగా సాగుతోంది. ఈ సమావేశంలో లోకేష్ వెంట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, మాస్కోలోని భారత రాయబారి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

# మేం పన్నులు కట్టి ఢిల్లీకి సలాం కొట్టాలా?

రాష్ట్ర విభజన, స్థానిక కారణాలతోనే తాను తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యత్వానికి, ఆపార్టీకి రాజీనామా చేసి, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌పార్టీలో చేరానని తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం విషయాలన్నీ రాహుల్ గాంధీకి తెలియజేశానని వివరించారు. గతంలో రాష్ట్రాన్ని పాలించే అవకాశం వచ్చిన వారు పాలకులుగా భావించారనీ, తాను సేవ చేయడానికి వచ్చిన ప్రజా ప్రతినిధిగా భావిస్తానని చెప్పారు. తెలంగాణలో ప్రభుత్వరంగంలో 2 లక్షలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయనీ, మాజీ సీఎం కేసీఆర్ ఆ సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్ ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా నియమించారనీ, ఆయన గ్రూప్-1 అభ్యర్థులన ఇంటర్వ్యూ చేస్తాడంటే ఇంతకంటే దౌర్భాగ్యం ఏముందన్నారు. అందుకే తాను యూపీఎస్సీ పనిని అధ్యయనం చేసి, దాన్ని టీజీపీఎస్సీలో అమలు చేస్తున్నామన్నారు. గతంలో మహారాష్ట్ర తర్వాత తెలంగాణలోనే ఎక్కువ సంఖ్యలో రైతు ఆత్మహత్యలు జరిగేవనీ, ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 25,035 రైతు కుటుంబాలకు చెందిన రూ.20,616 కోట్ల రుణాలను మాఫీ చేశామనీ, ఫలితంగా 2024-25 సంవత్సరంలో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను ఎన్‌సీఆర్‌బీ గుర్తించిందని చెప్పారు. కేంద్రం మద్దతు ధరలు ప్రకటించి, పంట ఉత్పత్తుల సేకరణను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సాధికారిత కోసం చేస్తున్న కృషిని వివరించారు. తెలంగాణ రైజింగ్-2024, మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ, క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ),ప్యూర్ (పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ), రేర్ (రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ)ల గురించి తెలిపారు. కుల వ్యవస్థ నిర్మూలన కోసమే యంగ్ ఇండియా స్కూళ్లు ఏర్పాటు చేశామన్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్ అనీ, యువతరం ప్రత్యామ్నాయంపై దృష్టిపెట్టి, నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. గుజరాత్ పెట్టుబడులను ఆకర్షించడం లేదనీ, అక్కడ .బలవంతంగా పెట్టుబడులు పెట్టేలా చేస్తున్నారనీ, గడచిన 20 ఏండ్లుగా ఇక్కడ ఒకే బ్రాండ్ అంబాసిడర్ పని చేస్తున్నారని తెలిపారు. పారిశ్రామిక పెట్టుబడుల ఆహ్వానంలో తమకు ప్రపంచ దేశాలతోనే పోటీ అని స్పష్టంచేశారు. త్వరలోనే తాను చైనా సందర్శించి,

# దేవాలయ భూములకు తగ్గిన ఆదాయం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 6 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాల్వ గ్రామంలో శనివారం దేవాలయ భూములకు సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం పాటల్లో ఈ ఏడాది ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. గ్రామంలోని శివనందీశ్వర దేవస్థానమునకు సంబంధించి 23.28 ఎకరాలు, శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం కు సంబంధించి 35.12 ఎకరాలు, శ్రీ వెంకటేశ్వర దేవస్థానమునకు సంబంధించి 4.04 ఎకరాలు, శ్రీ భైరవ స్వామి దేవస్థానమునకు సంబంధించి 10.70 ఎకరాల భూమిని ఒక ఏడాది కౌలుకు వేసుకునేందుకుగాను వేలం పాటలు నిర్వహించారు. శ్రీ శివ నందీశ్వర దేవస్థానమునకు సంబంధించి గత ఏడాది కంటే ఈ ఏడాది 6000 ఆదాయం తగ్గిపోయింది. శ్రీ చెన్నకేశవ దేవస్థానమునకు సంబంధించి 56వేల రూపాయలు, శ్రీ భైరవ స్వామి దేవస్థానమునకు సంబంధించి 56 వేల రూపాయల ఆదాయం తగ్గిపోయింది. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించి గత ఏడాది 1,66,000 వేల రూపాయలకు వేలంపాట జరుగగా, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో వేలంపాట జరిగింది. ఈ దేవస్థానమునకు సంబంధించి ఎలాంటి ఆదాయం పెరగలేదు. బహిరంగ వేలంపాటలకు పర్యవేక్షణాధికారిగా నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి పి హరిచంద్ర రెడ్డి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్, ఆలయ చైర్మన్లు మద్దిగారి పుష్పరాజు, ఏ బాలన్న, ధర్మకర్తల మండలి సభ్యులు మద్దిగారి చిన్న పాపయ్య, మద్దిగారి భూపాల్,దేవస్థానం సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు. వేలం పాటలు ప్రశాంతంగా జరిగేందుకు ఎస్ఐ జగన్ మోహన్, పోలీస్ సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

# అన్ని పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల దుస్తులు



దొర్నిపాడు జూన్ 6 పల్లె వెలుగు న్యూస్ రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు చెందిన పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ దుస్తులు దొర్నిపాడు మండలంలోని అన్ని పాఠశాలలకు చేరినట్లు ఎంఈఓ రామచంద్రయ్య తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొర్నిపాడు మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 22 ప్రైమరీ పాఠశాలలకు సంబంధించి 1973 మంది విద్యార్థి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,దుస్తులు నోటు పుస్తకాలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్లు ఆయన తెలిపారు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు, యూనిఫామ్ దుస్తులు అందజేస్తామన్నారు మిగతా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ,యూనిఫామ్ దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు ఆయనతెలిపారు, కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి విద్యాశాఖ అధికారులు, క్లస్టర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

### శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం





నంద్యాల ప్రతినిధి. జూన్ 06 . (పల్లె వెలుగు ): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్టీయూ పులివెందుల ప్రిన్సిపాల్ డా. విష్ణు వర్ధన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం కార్యక్రమానికి అధ్యక్షత వహించి పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకం మరియు ప్రకృతి సంరక్షణకు కట్టుబడి ఉండాలని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి డా. విష్ణు మాట్లాడుతూ వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారిన నేపథ్యంలో ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల హెచ్ఓడీలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రతిజ్ఞ చేశారు.

# ఆడపిల్లలను చదివించు, వారిని రక్షించు



దొర్నిపాడు జూన్ 6 పల్లె వెలుగు న్యూస్ ఆడపిల్లల రక్షణ వారి బాధ్యతలో భాగంగా శనివారం మండల కేంద్రమైన దొర్నిపాడుగ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రభాకరమ్మఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని పొలాల్లో ఉన్నఉపాధి కూలీల వద్దకు వెళ్లి,బాలికల బాల్యవివాహాల పై ఆడపిల్లలచదువు, రక్షణ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు,ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలన్నారు బాల్య వివాహాలు చేయడం నేరమని వారికి తెలియజేశారు వారి చేత ప్రతిజ్ఞ చేయించారు అనంతరం ఉపాధికులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వెంకటసుబ్బమ్మ, లక్ష్మి ,ఉపాధి కూలీలు పాల్గొన్నారు

# కర్నూలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 8వ తేదీ (సోమవారం) ఉదయం 9:30 గంటల నుండి జిల్లావ్యాప్తంగా 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా వినతులు, అర్జీలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

**జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు**

జిల్లా కేంద్రంతో పాటు ప్రజల సౌకర్యార్థం అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు (వీ=ూ ఆఫీసులు), రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు (=ణూ ఆఫీసులు), మరియు మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

**అర్జీల స్థితి కోసం 1100 నంబర్.. ఆన్‌లైన్‌లోనూ అవకాశం**

"అర్జీదారులు తాము సమర్పించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని (ఫ్ఫబం) తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు."

--- డాక్టర్ ఏ.సిరి, జిల్లా కలెక్టర్

సమస్యలు ఉన్నవారు నేరుగా రావడమే కాకుండా, ఆన్‌లైన్ ద్వారా కూడా తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌ను సందర్శించి తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ట్రాఫిక్ పోలీసులకు 'సమ్మర్ కిట్లు' పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

- **రూ.1.90 లక్షల విలువైన వస్తువుల అందజేత**
- **ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గౌతమ బుద్ధుని విగ్రహావిష్కరణ**
- **మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి రూ.50,800 ఆర్థిక సాయం**







పల్లె వెలుగు కర్నూలు బ్యూరో తీవ్రమైన ఎండల్లోనూ అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో డిజిపి చీఫ్ ఆఫీస్ నుండి మంజూరైన రూ.1 లక్ష 90 వేల 5 వందల విలువైన సమ్మర్ కిట్ బ్యాగులను సిబ్బందికి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు, పునర్నిర్మించిన గదులను ఎస్పీ ప్రారంభించారు.

**127 మంది సిబ్బందికి ప్రయోజనం**

ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.. కర్నూలు నగర ట్రాఫిక్ పోలీసులతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు ట్రాఫిక్ విభాగాల్లో పనిచేస్తున్న మొత్తం 127 మంది సిబ్బందికి ఈ సమ్మర్ కిట్లను అందజేసినట్లు తెలిపారు. ఈ కిట్‌లో ఎండల నుండి రక్షణ కోసం టోపీలు, స్టీల్ వాటర్ బాటిల్స్, ఎలక్ట్రాల్ బాక్సులు, మాస్కులు, కళ్లద్దాలు తదితర వస్తువులు ఉన్నాయన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బంది సేవలను ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.
హోంగార్డు కుటుంబానికి మానవతా సాయం
ఇటీవల విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన హోంగార్డు కృష్ణ కుటుంబాన్ని పోలీస్ శాఖ ఆదుకుంది. పోలీస్ సిబ్బంది అంతా కలిసి స్వచ్ఛందంగా సేకరించిన రూ.50,800ల ఆర్థిక సహాయాన్ని ఎస్పీ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి, తమ మానవత్వాన్ని చాటుకున్నారు. హాజరైన అధికారులు ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె. బాబు ప్రసాద్, కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, కర్నూలు టూ టౌన్ సీఐ శ్రీధర్, సీసీఎస్ సీఐ రామకృష్ణ, ఆర్ఎస్ఐలు మరియు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవన సముద్రం



పల్లె వెలుగు:సముద్రం ప్రకృతి వరం. చూడటానికి అందంగా ఉంటుంది. నీలి సముద్రం, అలల శబ్దం ఆత్మకు ఒక సంగీతంలాంటిది. అనంతమైన అందం, ప్రశాంతత, లోతులకు ప్రతీకగా సముద్రం అలలతో హాయిగా సాగుతుంది. అది మనసుకు స్ఫూర్తిని, ఓదార్పును అందిస్తూ ఎంతో హాయిని కలిగిస్తుంది. సముద్రం మనిషికి స్ఫూర్తిగా నిలుస్తుంది. ఎన్ని కష్టాలు వచ్చినా ఎప్పుడూ ఆగిపోవద్దని చెబుతుంది. నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిన మనిషికి ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇస్తుంది. పడి లేచే అలల ద్వారా ఎత్తుపల్లాలు అడ్డువచ్చినా ప్రవహిస్తూనే ఉండాలని సందేశం ఇస్తుంది. మనిషి జీవితంలోని ఎత్తుపల్లాలు సముద్రంలోని అలల వంటివి. వాటిని చూసి కుంగిపోకుండా, వాటిపై సవారీ చేయడం నేర్చుకోవాలి. వాటికి ధైర్యంగా ఎదురొడ్డి నిలిస్తేనే జీవితంలో విజయాలు సాధించగలమనే సందేశాన్ని సముద్రం అందిస్తుంది. సముద్రం అలలు ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలని బోధిస్తాయి. నదులన్నీ వచ్చి తనలో చేరినా, తనలో ఉన్న ఉప్పుదనాన్ని వీడదు. ఎండకు ఆవిరై వెళ్లిన నీటిని వర్షంగా మార్చి మళ్లీ నేలకు చేరుస్తుంది. పంటలకు, సాగుకు సహాయపడుతుంది. గుండెల్లో తుఫానులను దాచుకుని ప్రశాంతంగా కనిపించే సముద్రం, సుఖదుఃఖాల మధ్య జీవితాన్ని సాగించడమే మనిషి జీవితం అని తెలియజేస్తుంది. కష్టసుఖాల కలయికే సమాజమని, తీరని కోరికల తీరంలో పోరాటమే జీవన ప్రయాణమని చాటుతుంది. గుట్టలు, గుంతలు ప్రవాహానికి అడ్డువచ్చినా, ప్రకృతి వికటించినా తన దిశను మార్చుకుని ముందుకు సాగుతుంది. అవసరమైతే తీరం దాటి పరిగెడుతుంది. జలచరాలకు పుట్టినిల్లు, విలువైన ఖనిజాల నిక్షిప్త నిధి సముద్రం. సముద్ర తీరం మనోప్రశాంతతకు గొప్ప వరం. నీటి అంచుకు నడిచి వెళ్లి మీ చింతలను అలల్లో వదిలివేయండి. అలలు విరుచుకుపడతాయి, తుపానులు చెలరేగుతాయి. అయినా సముద్రం తన అందాన్ని కోల్పోదు. అలాగే మనిషి కూడా కోపాలు, బాధలు మనసులో చెలరేగినా సహనాన్ని వదలకూడదు. సంఘర్షణలకు దిగకూడదు. మనిషి మనసు సముద్రంలాంటి ప్రశాంతతకు కేంద్రంగా ఉండాలి. ప్రగతికి, పురోగతికి దిక్సూచిగా మారాలి. సమాజంలో సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలి.

-- నేదునూరి కనకయ్య
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, కాలమిస్ట్, కరీంనగర్

# పెసరవాయి గ్రామంలో ఆయుష్మాన్

## ఆరోగ్య కేంద్రం తాళాలు పగలగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు..







నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసరవాయి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తుల ప్రవేశించి అక్కడ మద్యం సేవించి ఆరోగ్య కేంద్రం యొక్క తాళాలను పగలగొట్టి, కుర్చీలను ధ్వంసం చేయడం జరిగినది ఇక్కడికి రాత్రివేళ సమయంలో వచ్చిన వ్యక్తులే ఈ ఘాత్కాలి పాల్పడినట్లు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది ఆలీ భాష ఆశ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఆరోగ్య కేంద్రానికి ఊరు చివరకు అవడంతో అక్కడ ఎలాంటి విద్యుత్ సదుపాయం లేకపోవడంతో మందుబాబులకు , అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా ఉందని వారు తెలుపుతున్నారు, ఇప్పటికైనా అధికారులు నాయకులు ఈ ఆరోగ్య కేంద్రానికి విద్యుత్ ఏర్పాటుచేసి సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉంటే ఇలాంటి దుర్చర్య జరిగేది ఉండేది కాదు, ఇక్కడికి చాలామంది ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్లకు సంబంధించిన టాబ్లెట్లు ,సిరప్ లు ఉంటాయి ఇలాంటి వాటిని ధ్వంసం చేయడం వలన ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని తెలిపారు, ఊరి చివర కావడంతో అందులో కనీసం నీటి సౌకర్యం కూడా లేదు గతంలో ఎన్నోసార్లు అధికారులకు తమ ఆవేదన వ్యక్తం చేసిన పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా మేల్కొని ప్రభుత్వ ఖజానాకు భంగం కలగకుండా చూడాలని నాయకులకు అధికారులకు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నామని వారు తెలియజేయడం జరిగింది..

# సిపిఐ అగ్రినేత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి

బేతంచర్ల పట్టణంలోని సిపిఐ కార్యాలయం నందు




మండల కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన భూ పోరాటయోధుడు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పూర్వ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు గారి 112వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించరూ.వారు మాట్లాడుతూ

కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పేరు చెప్పగానే భూమికోసం, భుక్తి కోసం, శ్రమజీవుల అభ్యున్నతి కోసం జరిగిన అనేక పోరాటాలు ఉద్యమాలు గుర్తుకు వస్తాయి.ఆయన భూస్వామ్య కుటుంబంలో పుట్టిన, తండ్రి ధనిక భూస్వామి అయినా కామ్రేడ్ రాజేశ్వరరావు ఒక సాధారణ వ్యక్తిగా నిరాడంబరంగా నిబద్ధతగల కమ్యూనిస్టుగా తన యావత్ జీవితాన్ని పేదల పోరాటాలకు అంకితం చేశారన్నారు, 1914 జూన్ 6న దివిసీమలోని, మంగళాపురం గ్రామంలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడిగా, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రముఖ నాయకులుగా గుర్తింపు, గౌరవం పొందారన్నారు, భూస్వాములను, జమీందారులను ఎదిరించి భూమిలేని పేదల పక్షాన నిలిచి భూమిలేని పేదలలో పేదగా రైతులు ఆర్థిక సామాజిక అభివృద్ధికి కృషి చేశారని పేదల హక్కుల కోసం జరిగే పోరాటంలో తెగింపుగా అక్రమాలను, అన్యాలను ఎదిరించి నిలబడ్డారన్నారు, సామాజిక అంశాలలో లోతైన ఆలోచనతో సంయమనంగా వ్యవహరించే వారని, స్వగ్రాపం మంగళాపురం అటవీ భూమిగా ఉన్న 5000 ఎకరాల భూమిని జమీందారులు అమ్ముకుంటుంటే దానిని ప్రతిఘటించి గ్రామంలోని పేదలకు ఆ భూమి దక్కేవరకు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పోరాటాన్ని నిర్వహించారు. స్వగ్రామంలో ప్రారంభించిన భూ పోరాటాన్ని కృష్ణాజిల్లా అంతట మునగాల పరగణాలోను తర్వాత కాలంలో దేశవ్యాప్త భూ ఆక్రమణ ఉద్యమంగా మలిచిన మహానాయకుడు చంద్ర రాజేశ్వరరావు, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 1969---70 ప్రాంతంలో దేశవ్యాప్త భూ పోరాటానికి నాయకత్వం వహించారని టాటాలు, బిర్లాలు వంటి పారిశ్రామిక దిగ్గజాల ఆక్రమణలో లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించడం, వేలాది మందిని అరెస్టులు జరిగిన లెక్కచేయకుండా భూ సమస్యను నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం గుర్తించేటట్లు చేయడంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారు. రాజేశ్వరరావు పోరాట పటిమ పట్ల నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం అనేక రాష్ట్రాలలో భూసంస్కరణ చట్టాన్ని తీసుకు రాగలిగారన్నారు నేటి యువ కమ్యూనిస్టులు ఆయన పోరాట పటిమను వారసత్వంగా చేసుకుని భవిష్యత్తు పోరాటాలకు సమాయత్తం కావాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, మధు, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్, సిపిఐ నాయకులు ఎల్లకృష్ణ, గౌరీ.ఉదయ్, శ్రీను, మనోజ్, గణేష్ , సూర్య,మహబూబ్, నాగేంద్ర, బాబు, తదితరులు పాల్గొన్నారు

# సాదాసీదాగా సాగిన సర్వసభ్య సమావేశం

☛అధికారులుబాధ్యతలను విస్మరించకూడదు.

☛మండలమీట్లో మాట్లాడుతున్న ఎంపీపీ ఆమర్నాథ్రెడ్డి



మండల కేంద్రమైన దొర్నిపాడు ఎంపీడీవో కార్యాలయం నందు శనివారం మండల అధ్యక్షుడు గోపవరం అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో సాదాసీదాగా సర్వసభ సమావేశం సాగింది, ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూవిధినిర్వహణలో ఉన్న అధికారులు తమ బాధ్యతలను విస్మరించకూడదని ఆయన అన్నారు.ఇటీవల గుండుపాపల గ్రామంలో కలెక్టర్ పర్యటన జరగడంతో అధికారులు ఎవరూ ఎంపీపీకి ఆహ్వానం పలకలేదు. దీంతో ఆయన అధికారులందరికీ రాజ్యాంగ విలువలు తెలుసు కదా ప్రజా ప్రతినిధులకు సమాచారమైన ఇవ్వాలి కదా అని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే మండలంలో పీఆర్ ఏఈ లేక పోవడంతో పనులు సాగడం లేదని వెంటనే నియమించాలని డీఈ క్రిష్ణారెడ్డికి కోరారు. అందుకు ఆయన స్పందిస్తూ ప్రస్తుతం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్తో పనులు చేయిస్తున్నామని ఉన్నతాధికారులతో మాట్లాడి ఇన్చార్జ్గా వేయిస్తామని హామి ఇచ్చారు. గుండుపాపల గ్రామంలో నీటి ఎద్దడి నెలకొందని కనీసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించి సమస్యను పరిష్కరించాలని ఆర్డబ్ల్యూఏఈ సుప్రియకు సూచించారు. ఏ ఈ ఓ మణికంఠ మాట్లాడుతూఎర్నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులు తప్పేలా లేవని రైతులు చిరుధాన్యాల సాగుకు సమాయాత్తం కావాలని ఆయన కోరారు,రెవెన్యూ, ఆర్అండ్, రవాణా శాఖలకు సంబంధించి అధికారులు గైర్హాజరు కావడంతో వాటి ప్రస్తావన రాలేదు. వచ్చిన విద్యా, వెలుగు, స్వచ్ఛ భారత్, స్వచ్ఛా ఆంధ్రా కార్యక్రమాలపై ఎంఈఓ రామచంద్రయ్య. ఏపీఎం బాబు, డిప్యూటీ ఎంపీడీఓ శివప్రసాద్ ఉన్న సమాచారాన్ని సభలోచదివి వినిపించారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో సమావేశం బోసిపోగా ఉన్న ఎంపీటీసీ ప్రజాసమస్యలపై నొరుమెదపలేదు. కార్యక్రమంలో కో ఆప్షన్ నెంబర్ అచ్చుకట్లషఫీ భాష,డిప్యూటీ ఎంపీడీఓ చంద్రమౌళి, పశువైద్యాధికారి చిన్నబాబు, సీడీపీఓ సూపర్వైజర్ ప్రభాకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత,బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమంలో

☛మహిళల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత

☛ఎమ్మిగనూరు రూరల్ సీఐ చిరంజీవి

☛ఎస్సై తిమ్మారెడ్డి











నందవరం పల్లె వెలుగు జూన్ 6 నందవరం మండల పరిధిలో ముగతి గ్రామంలో మహిళల భద్రత,బాల్య వివాహాల నివారణ మరియు మహిళల విద్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఎస్సై తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి సీఐ చిరంజీవి ముఖ్య అతిధిగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల భద్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని మహిళలపై వేధింపులు,దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఏదైనా ఇబ్బంది ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు,హెల్ప్లైన్ సేవలు అందుబాటులో ఉంచిందని 18 సంవత్సరాల లోపు బాలికలకు 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం జరపడం చట్టవిరుద్ధమని బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యానికి,విద్యకు,భవిష్యత్తుకు హానికరమని గ్రామస్థులు ఇలాంటి సంఘటనలు గమనించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.నందవరం ఎస్సైతిమ్మారెడ్డి,ఎస్బి ఏ ఎస్సై నటరాజ్ లు మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధి సమాజ పురోగతికి మూలస్థంభమని చదువుకున్న మహిళ కుటుంబాన్ని,సమాజాన్ని ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని,చిన్న వయసులో వివాహాలకు ఒప్పుకోకూడదని సూచించారు.మహిళల భద్రత మన అందరి బాధ్యత అని మరియు బాల్య వివాహాలకు నో చెప్పండి విద్యకు ఒకే చెప్పాలని బాలికలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్,టిడిపి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ భార్గవ్ యాదవ్, గ్రామ అధ్యక్షులు గుగ్గిరి నరసింహులు,గొర్రెలు సంఘం అధ్యక్షులు కొండారెడ్డి,మోడల్ స్కూల్ చైర్మన్ రవి,వెంకటేష్ గౌడ్,చాకలి రామకృష్ణ,శీను,రంగన్న,సురేష్ గౌడ్,పోలీస్ సిబ్బంది,శక్తి టీం,గ్రామ ప్రజలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై పశుదాణా పంపిణీ చేసిన ఏ డి వెంకటేశ్వర్లు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 6 : బండి ఆత్మకూరు మండలంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వ సబ్సిడీపై పశువుల దాణా ను పంపిణి చేస్తున్నట్లు వెలుగోడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు శనివారం సాయంత్రం తెలిపారు. ఏ కోడూరులో పశువుల దానాలు పంపిణీ చేసిన అనంతరం ఎడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో రెండు వెటర్నరీ డిస్పెన్సరీలు, ఐదు రూరల్ లైవ్ స్టాక్ యూనిట్లు, ఏడు రైతు సేవా కేంద్రాలు కలిపి మొత్తం 14 కేంద్రాల ద్వారా ఈ పంపిణీ జరుగుతుందని ఏడీఏ పేర్కొన్నారు. ప్రతి వెటర్నరీ డిస్పెన్సరీకి 50 బ్యాగులు, రూరల్ లైవ్ టాక్ యూనిట్, రైతు సేవా కేంద్రాలకు కల 45 బ్యాగులు చొప్పున మొత్తం 640 బ్యాగుల బస్సు దాణా పంపిణీ అవుతుందని పేర్కొన్నారు. ప్రతి పసి దాణా బ్యాగు ( 50 కేజీలు) మార్కెట్ ధర1,110 రూపాయలు కాగా ప్రభుత్వం 50% సబ్సిడీ అందిస్తుందని అన్నారు. రైతులు కేవలం 555 మాత్రమే చెల్లించి బ్యాగును పొందవచ్చునని అన్నారు. మొత్తం పంపిణీ విలువ 7,10,400 రూపాయలు కాగా, ప్రభుత్వం 3,55,200 రూపాయల సబ్సిడీని భరిస్తుందని అన్నారు. ఇప్పటికే మూడు కేంద్రాలలో పంపిణీ పూర్తయింది అని తెలిపారు. మిగిలిన 11 కేంద్రాలలో ఒక వారం వ్యవధిలో పంపిణీ పూర్తి చేస్తారని సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు వివరించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపుతుంది

--టిడిపి నాయకులు ఉమాపతి నాయుడు





ఆదోని రూరల్ పల్లె వెలుగు పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో శనివారం టిడిపి ఇన్చార్జ్, మాజీ శాసనసభలు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు చేతుల మీదగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. 56 కుటుంబాలకి కాను రూ.18,04,242 లక్షల పంపిణీ చేశారు.గత 23 నెలల్లో ఇప్పటిదాకా 912 మంది లబ్ధిదారులకు రూ.2,30,92,018 కోట్లకు పైగా అందించామన్నారు. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక కొండంత అండగా నిలుస్తోందని టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని తమ ఆర్థిక, ఆరోగ్య ఇబ్బందులను తొలగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుపేదల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్సల కోసం డబ్బులు చెల్లించలేని స్థితిలో ఉన్న వారికి ముందస్తుగా ఎల్ఓసీ కూడా మంజూరు చేస్తూ ప్రభుత్వం భరోసా ఇస్తోందన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఏ కోడూరులో కార్డెన్ అండ్ సెర్చ్



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 6: నంద్యాల జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామంలో శనివారం ఉదయం ఎస్ఐ జగన్మోహన్ పోలీసు సిబ్బంది కార్టెన్ అండ్ సెర్చ్ ప్రోగ్రామ్ను నిర్వహించారు. ఈ మేరకు అనుమానితులైన పలువురు వ్యక్తుల ఇళ్లను పోలీసులు తనిఖీ చేశారు. సందర్భంగా రామానాయుడు అనే వ్యక్తి ఇంట్లో పది మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామంలో ప్రజలందరిని సమైక్యపరిచి ఎస్ఐ జగన్మోహన్ సమావేశాన్ని నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల ఏర్పడే ఆపదలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల కారణంగా జరిగే నష్టాలను గురించి ప్రజలకు వివరించారు. అపరిచిత వ్యక్తులు, గ్రామాలలో తిరిగేటప్పుడు, ప్రజలు వెంటనే గుర్తించి 100, 112, 1930 నంబర్లకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ జగన్మోహన్ ప్రజలకు సూచించారు.

# ఘనంగా గ్రంధాలయం ముగింపు వేడుకలు



దొర్నిపాడు జూన్ 6 పల్లెవెలుగు న్యూస్ మండల కేంద్రమైన దొర్నిపాడు శాఖ గ్రంధాలయం నందు శనివారం గ్రంధాలయ అధికారిని అఖిల బేగం ఆధ్వర్యంలో గ్రంధాలయ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు, ముగింపు వేడుకలకు మండల విద్యాధికారి రామచంద్ర హాజరయ్యారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగ్రంధాలయ వేసవి పునఃశ్చరణ కార్యక్రమములో భాగంగా శాఖా గ్రంధాలయం దొర్నిపాడునందు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను మండల విద్యాధికారి రామచంద్రయ్య చేతులమీదుగా అందజేశారు, ఈ కార్యక్రమంలోజిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి,పాఠకులు ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు,

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మహానంది, పల్లె వెలుగు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అంగన్వాడి కార్యకర్తలు పేర్కొన్నారు. శనివారం మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని అంగన్వాడి టీచర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు,సచివాలయం –2లో మహిళలతో బాల్య వివాహాల చట్టాలపై అవగాహన కల్పించారు. ముందుగా ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు.చట్ట ప్రకారం వివాహానికి అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండి ఉండాలని స్పష్టం చేశారు. ఈ వయస్సు కంటే తక్కువ ఉన్న వారికి పెళ్లి చేయడం నేరమని, ఒకవేళ బాల్య వివాహం చేస్తే తల్లిదండ్రులు, బంధువులతో పాటు దానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ నేరస్తులుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నారులకు సంతోషకరమైన, ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిత్య అన్నదానమునకు 10వేలు అందజేసిన దాత



బేతంచెర్ల పల్లె వెలుగు ప్రతినిధి (జూన్ 6):-- నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రం శ్రీ ఘన మద్దిలేటిస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రంకు బనగానపల్లె నివాసి గ్రామీణ వార్త ఎడిటర్ యు.రాజశేఖర్ కుమారుడు ఉప్పు మోహన కృష్ణ స్వామివారికి మొక్కుబడిలో భాగంగా రూ.10 వేలు దేవాదాయ శాఖ ఇంచార్జి డిప్యూటీ కమిషనర్, ఆలయ ఉప కమిషనర్ ఎం రామంజనేయులుకు శనివారం కార్యాలయంలో అందచేసారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ ఎం రామాంజనేయులు మాట్లాడుతూ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదానసత్రానికి విరాళాలు ఇచ్చే భక్తులు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని ఆన్లైన్ సేవద్వారా చెల్లింపులు జరపవచ్చని అన్నారు.

# మహిళా సంఘాలకు సూపర్ నారీ యాప్ మేలు



మహానంది, పల్లె వెలుగు పొదుపు మహిళా సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ నారీ యాప్ తో అందరికీ మేలు జరుగుతుందని డిఆర్డిఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ వైబి శ్రీధర్ రెడ్డి తెలిపారు. శనివారం మహానంది మండలంలోని గాజులపల్లె, బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాల్లో డిఆర్డిఏ, ఎస్ ఈ ఆర్పి వెలుగు ఆధ్వర్యంలో పొదుపు మహిళలతో 'మన డబ్బులు– మన లెక్కల' పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీల్లో పూర్తి పారదర్శకత ప్రవేశపెట్టి మన డబ్బులు – మన లెక్కలు చూసుకునే విధంగా ఈ యాప్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. సిబ్బంది దీనిపై అందరికీ అవగాహన కల్పించి దీని ప్రాధాన్యతలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఎస్ హనుమాన్ నాయక్, డిపిఎం రంగారావు, ఏపిఎం తిరుపాల్రెడ్డి, సిసి వివోలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

# మహానందిలో యోగా తరగతులు



మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో ఈనెల 8వ తేదీ నుంచి 21 వరకు ప్రతిరోజు యోగా తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు భక్తులకు అనుభవజ్ఞులైన యోగా గురువులచేత శిక్షణలు ఇవ్వబడుతాయన్నారు. మహానందిలో ఈనెల 12వ తేదీన వేలాది మందితో యోగా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఇందులో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. నిత్య యోగ తరగతులలో పాల్గొనేవారు దేవస్థానంలోని సమాచార కేంద్రం నందు పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈవో కోరారు.

# బాలికల భవిష్యత్తు కోసం కిషోరి వికాసం



నందవరం పల్లె వెలుగు జూన్ 06 మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మే1 నుంచి జూన్ 9వ తేదీ వరకు కిషోరి బాలికలకు వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమము నిర్వహించడం జరుగుతున్నాయి.అందులో భాగంగా నందవరం మండలం హాలహార్వి గ్రామం అంగన్వాడి కేంద్రం – 4 లో కిషోరి వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమము నిర్వహించడం జరిగింది.అయితే 11వ రోజు భాగంగా పొగాకు,మద్యం,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమము నిర్వహించారు.ఈ సందర్భంగా సోషియల్ వర్కర్ యన్ నరసింహులు మాట్లాడుతూ యువత ముఖ్యంగా నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.ఇలాంటి నిషేధిత మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల తమ బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు.ఈ మాదక ద్రవ్యాల మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దని ప్రస్తుతం గంజాయి,బ్రౌన్ షుగర్,హీరయన్,కోకోయిన్ తదితర మాదకద్రవాలకు బానిసలై కొంతమంది యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.విద్యార్థులు నూరేళ్ల జీవితంలోని వెలుగును దూరం చేసుకుంటున్నారన్నారు.ముఖ్యంగా ఇలాంటి మాదక ద్రవ్యాలకు బానిసలై నిరంతరము వాటిని వాడే కొద్ది శరీరంలోని ఇతర వ్యవస్థల పైన దుష్ప్రభావాలు చూపుతాయి.మరియు శరీరంలోని ప్రధాన అవయవాలైన గుండె,మెదుడు లివర్,ఊపిరితిత్తులు వాటి పనితీరును మందగిచ్చేటట్లు చేసి చివరకు చనిపోయే వరకు దారితీస్తాయన్నారు.ఆశా కార్యకర్త లలిత మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత ఆరోగ్యం మరియు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు ఎదుగుదలకు అనుగుణంగా నిత్యజీవితంలో మంచి పౌష్టిక ఆహారము మరియు సమతుల్య ఆహారము తీసుకోవడం వల్ల రక్తహీనతకు దూరంగా ఉండడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి లక్ష్మీదేవి,ఏ జయంతి,బి లలిత మరియు ఆశ కార్యకర్త పి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తల సభ్యత్వ ప్రమాద

# బీమా కింద గంగమ్మ గోపాల్ కుటుంబానికి

**☛రూ.5 లక్షల ధృవపత్రాలు అందజేసిన ☛ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి**

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 6



తెలుగుదేశం పార్టీ సామాన్యులకు భరోసా కల్పించే పార్టీ అనే విషయం మరోసారి నిరూపితమైంది. ఇటీవల ప్రమాదంలో మృతిచెందిన గోనెగండ్ల మండలం వీరంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గంగమ్మగోపాల్ సతీమణి గంగమ్మ మాదేవి కి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా నిధులు మంజూరయ్యాయి. బీమా కంపెనీ ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.5 లక్షల జమయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మృతి చెందిన కుటుంబ సభ్యులకు నారా లోకేష్ సంఘీభావ సందేశ పత్రం మరియు బ్యాంకు నగదు జమ ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమం పట్ల తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సకాలంలో పార్టీ అధిష్ఠానానికి అవసరమైన వివరాలు పంపించడంతో ఈ ప్రమాద బీమా నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అలాగే కార్యకర్తల కుటుంబాలకు ఈ బీమా నిధులు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, విద్యా మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ పరిశీలకులు పి ముని శేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, ప్రజాప్రతినిధులు, టీడీపీ మండల కమిటీ సభ్యులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి.

**సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత.**



కేసముద్రం, జూన్ 06పల్లె వెలుగు :రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాలలో పని చేస్తున్న టీచర్లు, సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం కేసముద్రం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రాకేష్ కు సిఐటియు అనుబంధ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ గత 50 సంవత్సరాల నుండి పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని, వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులు ఉన్నారని, నేటికీ వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన అంగన్వాడీల జీవితాల్లో ఎలాంటి మార్పులు లేవని, చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ కు నెలకు రూ.18 వేల రూపాయల వేతనం చెల్లిస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. గతం, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిన ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ కేంద్రాలను తక్షణమే రద్దు చేయాలనీ, ఈ కేంద్రాలను అంగన్వాడీలకు అప్పగిస్తూ వెంటనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, జీవో నెంబర్ 14 సవరించి అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలనీ, అత్యున్నత న్యాయస్థానం చెప్పిన విధంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ కు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు చెల్లించి, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేసి ఐసిడిఎస్ కు సంబంధం లేని అదనపు పనులు చేయించకూడదన్నారు. పెండింగ్ లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, 24 రోజుల సమ్మె ఒప్పందం ప్రకారం ఈ మధ్యకాలంలో చనిపోయిన అంగన్వాడి టీచర్స్, హెల్పర్ల కు రెండు లక్షల ప్రమాద భీమా డబ్బులు చెల్లించాలని, రాష్ట్రంలో అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు అన్నిటిని ఒకేసారి భర్తీ చేయాలని, 2017 నుండి టీఏ, డీఏలు ఇంక్రిమెంట్ ఇన్చార్జి అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని, మంత్రి హామీ ప్రకారం కారుణ్య నియామకాలు త్వరగా చేపట్టాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే సలీమా, కొమ్ము రజిని తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వార్డుల్లో సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి.

**వార్డు సభలో మున్సిపల్ చైర్ పర్సన్ సునీతవెంకన్న.**



కేసముద్రం, జూన్ 06(పల్లె వెలుగు :ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం కేసముద్రం మున్సిపల్ పరిధిలో వార్డుల సభ నిర్వహించారు. ఈ వార్డుల సభలకు కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్ పర్సన్ అల్లం రమ నాగేశ్వర్ రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పంట మార్పిడి చేద్దాం–భూసారాన్ని కాపాడుదామని రైతు సోదరులకు సూచించారు. మహిళల భద్రత, కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. వార్డులో డ్రైనేజ్, సానిటేషన్, సైడ్ డ్రెయిన్ ల పూడికతీత సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు వార్డు కౌన్సిలర్లు చెప్పి చేయించుకోవాలన్నారు. రాబోయే వర్షాకాలంలో నీటి నిలువ లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. వార్డ్ లో లైట్, రోడ్, సమస్యలు ఉంటే సంబంధించిన అధికారులకు లేదా కౌన్సిలర్ల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మున్సిపాలిటీ ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటామని ప్రజలకు ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.శ్రీనివాస్ రావు, వార్డ్ కౌన్సిలర్లు తరాల వీరేష్, కిషోర్, భారతి, సుభద్ర, విజయ, ఉమ, వినయ్, రాము, కృష్ణ, సునీత, శారద, విద్యా, వ్యవసాయ, వైద్య, పోలీస్, పట్టణాభివృద్ధి, రెవిన్యూ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్, ఆశ వర్కర్స్, మున్సిపాలిటీ ఆర్పీలు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

# కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక



నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలం పెసరవాయి గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి గ్రామానికి చేరుకోగానే మండల కన్వీనర్ దిలీప్ కుమార్ రెడ్డి, గ్రామ టిడిపి నాయకురాలు ఒడ్డు లక్ష్మీదేవి,ఒడ్డు ప్రశాంతి ఆమెకు పూలమాలలతో అపూర్వ స్వాగతం పలికారు, ఏర్పాటుచేసిన సమావేశంలో రైతులతో ఆమె మాట్లాడుతూ భూ హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ద్వారా కృషి చేస్తుందనీ భూ రికార్డులు మార్పు చేసేందుకు వీలు లేకుండా ఆధునిక పరిజ్ఞానంతో డిజిటలైజేషన్ ప్రజల హక్కులను గౌరవిస్తూ వారికి భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వం యొక్క ముఖ్య లక్ష్యం.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెవిన్యూ, భూ సమస్యలను నిర్దిష్టమైన సమయంలోగా పరిష్కరించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించడం జరిగిందన్నారు. మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించే పాలనను ముఖ్యమంత్రి అందిస్తున్నారన్నారు. పేదవారు రూపాయి, రూపాయి దాచుకుని కొనుకున్న భూములపై వారికి పూర్తి హక్కులు కల్పించేదిశగా పట్టాదార్ పాస్ బుక్ తో రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందన్నారు. గతంలో నిర్వహించిన రీ సర్వేలో జరిగిన తప్పులను ప్రస్తుత ప్రభుత్వం సరిచేసి రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులందరికీ అందజేస్తుందన్నారు.గత వైసిపి ప్రభుత్వం లో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫోటో ముదిరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత గత ప్రభుత్వ వైసిపిదే, అందుకే ప్రజలు కేవలము 11 సీట్లకే పరిమితం చేశారు, ప్రభుత్వంపై అబద్ధం సృష్టించి ప్రభుత్వంపై బురద చల్లడమే వాళ్లకు



వెన్నతో పెట్టిన విద్య, ప్రభుత్వం ఇచ్చిన ఏర్పడిన వెంటనే 16 వేల మందికి పైగా డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలను ఇప్పిస్తే అది ఓరవలేక మీ ప్రభుత్వంలో అవకతవకలు జరిగాయని సంవత్సరం తర్వాత చెప్పడం విడ్డూరంగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు 20,000వేల రూపాయలను అన్నదాత సుఖీభవ కింద అందించడం ఘనత కూటమి కె దక్కుతుందని తెలియజేశారు, పింఛన్ల గురించి సంవత్సరానికి ?250 చొప్పున పెంచిన వారు మాట్లాడడం ఎంతవరకు నిజమో ప్రజలకు అన్ని తెలుసు. రాష్ట్ర ప్రభుత్వము ఒకపక్క సంక్షేమము మరోపక్క అభివృద్ధి బాటలో తీసుకు వెళుతున్న మా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం గురించి మీరు మాట్లాడడం నక్కకు నాగోలోకానికి ఉన్నంత తేడా ఉందని విమర్శించడం జరిగింది, గ్రామాలలో ఎక్కడ చూసినా సిసి రోడ్లు రహదారులు సస్యశ్యామలంగా ఉన్నాయంటే అది కేవలము చంద్రబాబు నాయుడు గారి చొరవ మాత్రమే,పేదవాడికి కేవలము ఐదు రూపాయలకే కడుపునిండా మంచి రుచికరమైన భోజనం దక్కుతుందంటే అది కేవలం టిడిపి ప్రభుత్వానికి సాధ్యం, ఇలాంటి మంచి పనులు చేస్తుంటే ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శించడం గొడ్డలి పార్టీ వారికి వెన్నతో పెట్టిన విద్య,గతంలో మీరు చేసిన అరాచకాలను ప్రజలు గుర్తించి అందుకే మా కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టడం జరిగింది రేపు జరగబోయే లోకల్ బాడీ ఎలక్షన్లో అందరూ కలిసికట్టుగా కృషిచేసి ఎంపిటిసిలు ,వార్డు మెంబర్లు, జడ్పిటిసిలు, ప్రతి ఒక్కటి మనమే స్వాధీనం చేసుకొని మంచి మెజార్టీలు ఇవ్వాలని ప్రజలకు నాయకులకు మనం చేస్తున్న అభివృద్ధి పనులను వారికి కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నామని తెలిపారు. గతంలో అలగనూరు రిజర్వాయికి కేవలము మూడు కోట్లతో పోయే పనిని వారి కమిషన్ల కోసము సంవత్సరాలు గడిచిన పనులు మొదలుపెట్టకుండా చిన్న ఆనకట్ట తెగిపోతే ఏర్పాటు చేయకుండా వారి నిర్లక్ష్య ధోరణి వల్లనే ఇప్పుడు మళ్లీ 36 కోట్ల రూపాయలతో కూటమి ప్రభుత్వము ఆనకట్ట నిర్మించుటకు శాంక్షన్ చేసిందని అదేవిధంగా దుర్గాభవించడానికి సిసి రోడ్లు అభివృద్ధి పనులకు కుటుంబ ప్రభుత్వం ఎంతో సహకరిస్తుంది, ఎస్సీ వాళ్లకు , హెయిర్ సెలూన్ షాప్(నాయి బ్రాహ్మణులు) లకు విద్యుత్ 200 యూనిట్లు వరకు ఉచితంగా మన ప్రభుత్వము విద్యుత్ ఛార్జింగ్ లేకుండా ఇస్తుంది అదేవిధంగా టైలరింగ్ వాళ్లకు ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 15000వేల రూపాయలు చొప్పున, తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే ఒక్కొక్కరికి 13000 రూపాయలు చొప్పున ఇచ్చిన ఘనత మన కూటమి ప్రభుత్వానిదే. అనంతరము రైతులతో మాట్లాడి మీకు జొన్నలు కొనుగోలు పై ఈ విషయాన్ని కూడా పై అధికారులు మాట్లాడి త్వరలోనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ దిలీప్ కుమార్ రెడ్డి గడివేముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు దేశం సత్యనారాయణరెడ్డి, ఒడ్డు లక్ష్మీదేవి, ప్రశాంతి,మురళీమోహన్ రెడ్డి, బొల్లవరం సుభద్రమ్మ, పంట రామచంద్రారెడ్డి,ఆర్లగడ్డ ఈశ్వర్ రెడ్డి , జయప్రకాష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఫరూక్ ,దుర్గ భోగేశ్వర ఆలయ చైర్మన్ కంది శ్రీనివాసులు,కత్తి గడివేముల మూల పెద్దమ్మ ఆలయ చైర్మన్ రమణారెడ్డి, జమాల్ బాషా, బిడుదురి రమణారెడ్డి కృష్ణ యాదవ్, గణేష్ రెడ్డి , వెంకటరమి రెడ్డి,చంద్రహాస్ రెడ్డి, తాసిల్దార్ వెంకటరమణ ఎంపీడీవో వాసుదేవ గుప్తా, గ్రామ స్పెషల్ ఆఫీసర్ వీర శేఖర్, వీఆర్వో రాజు, తూము బాలేశ్వర్ రెడ్డి, మండల టిడిపి నాయకులు సచివాలయ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు, రైతులు మహిళలు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీల సంఘటన జరగకుండా గడివేముల ఎస్సై సీసీ నాగార్జున రెడ్డి తన సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖ న్యాయమూర్తుల

ర్యాలి,పల్లె వెలుగు







శనివారం జూన్ 06 :- డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ర్యాలిలో వెలసిన శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారిని శనివారం ప్రముఖ న్యాయమూర్తులు దర్శించుకున్నారు. పాట్నా హైకోర్టు న్యాయమూర్తి ఎ.అభిషేక్ రెడ్డి ఆలయానికి విచ్చేయగా, ఆలయ అధికారులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారిని దర్శించుకుని, ఆలయ అన్నదాన పథకం నిమిత్తం 10,116 రూపాయల విరాళాన్ని సమర్పించారు. అదేవిధంగా, త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎస్. రామచంద్రరావు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి ఆలయం తన విశిష్టమైన శిల్పకళా సంపదకు, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతకు ప్రసిద్ధి చెందింది. ఈ క్షేత్రాన్ని దర్శించుకోవడానికి నిత్యం భక్తులు పోటెత్తుతుంటారు. ముఖ్యంగా రాష్ట్ర, దేశ స్థాయిలోని ప్రముఖులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు ఇక్కడికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి వారిని దర్శించుకోవడం వల్ల సకల శుభాలు కలుగుతాయని, కోరిన కోరికలు తీరుతాయని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. అనంతరం దేవస్థానం అధికారులు వారికి స్వామి వారి శేష వస్త్రాలు మరియు చిత్రపటాలను అందజేసి ఘనంగా సత్కరించారు






## ర్యాలి జగన్మోహిని కేశవ గోపాల స్వామి ఆలయానికి దాతల విరాళాలు

ర్యాలి,పల్లె వెలుగు

శనివారం జూన్ 06 :- ర్యాలి గ్రామంలో వెలసిన శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారిని శనివారం పలువురు భక్తులు దర్శించుకున్నారు. హైదరాబాద్ వాస్తవ్యులు తోలేటి ఉదయ్ కిరణ్ మరియు సాయి రమ్య దంపతులు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయ అన్నదాన పథకం నిమిత్తం 5,116 రూపాయల విరాళాన్ని సమర్పించారు. దాతలకు ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించగా, అధికారులు శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా, చిలకపాడుకు చెందిన చిమ్మా నాగేశ్వరరావు మరియు సుధ దంపతులు స్వామి వారిని దర్శించుకుని, ఆలయ అభివృద్ధి పనుల కోసం 10,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతల పట్ల ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, వారికి కూడా ఆశీర్వచనం మరియు శేష వస్త్రంతో సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దాతలు మరియు భక్తులు పాల్గొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ర్యాలి ఆలయానికి భక్తులు విరాళాలు అందజేస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు

# రావులపాలెంలో 111 కోట్ల ఆర్థిక లబ్ధి, అభివృద్ధి పనులకు

# మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బండారు శ్రీకారం

రావులపాలెం,పల్లె వెలుగు



శనివారం జూన్ 06 :- ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం రావులపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వీజీబిరామ్ జీ నిధులతో కోటి రూపాయల వ్యయంతో జూనియర్ కళాశాల నుంచి శ్మశాన వాటిక వరకు బీటీ రోడ్డుకు, 40 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 12 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో వివిధ పథకాల కింద 82 మందికి 4.86 కోట్లు, 30 మందికి 33 లక్షలు, ముగ్గురికి 3 లక్షలు, 588 స్వయం సహాయక సంఘాలకు 106 కోట్ల బ్యాంక్ లింకేజీ కలిపి మొత్తం 111.19 కోట్ల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈల ప్రోత్సాహంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వినూత్నంగా ముందుకెళ్తున్నారని అభినందించారు. రావులపాలెంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు అభినందనీయమన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యాలకు అనుగుణంగా స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తున్నామని, మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇచ్చామని, ప్రతిపక్షం చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు గమనించాలని సూచించారు

# 8న నంద్యాలలో జిల్లా మంత్రులతో సమీక్షా సమావేశం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 6: నంద్యాల జిల్లాలో ఈనెల 8న ఉదయం 10 గంటలకు ఇన్చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశం జరుగునున్నది. ఈ విషయాన్ని శ్రీశైలం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం శనివారం రాత్రి పేర్కొంది. ఇంచార్జి మంత్రి పయ్యావుల కేశవ్ తో పాటు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు, నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇన్చార్జి, జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు ముఖ్య నాయకులంతా తప్పకుండా హాజరుకావాలని తెలుగుదేశం పార్టీ కార్యాలయం పేర్కొంది.

# రైతుల కోసమే వంకలో మట్టి



సిరివెళ్ల (పల్లె వెలుగు న్యూస్) సిరివెళ్ల మండల పరిధిలోనికొట్టాలపల్లి రైతులు గ్రామ పరిధిలోని వంకలో మట్టి రైతుల కోసం వాడుకుంటున్నట్లు కొట్టాలపల్లి గ్రామ రైతులు పేర్కొన్నారు. పొలాల రస్తాలు శిథిలమై రాకపోకలకు ధాన్యాన్ని తరలించేందుకు ఇబ్బందికరంగా ఉన్నచోట గుంతలుగా మారిన చోట వంకలో మట్టి తోలుకొని పూడ్చుకుంటున్నట్లు కొట్టాలపల్లి రైతులు తెలియజేశారు. కొందరు గిట్టని వారు అవగాహన లేనివారు అక్రమ మట్టి తవ్వకాలు అంటూ ఆరోపించడం వాస్తవం కాదని రైతులు తెలియజేశారు. వర్షాకాలంలో పొలాలకు వెళ్లాలన్నా పొలాలకు మందు బస్తాలు తీసుకొని పోవాలన్నా ఎంత ఇబ్బంది పడుతున్నారు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ ఊరు తమ ఇతరులు ఇతర గ్రామస్తులు తమపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఈ సందర్భంగా రైతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సారెడ్డి ప్రతాపరెడ్డి, నరసింహారెడ్డి ఇతర 30 మంది రైతులు పాల్గొన్నారు.

## బేతంచర్ల కు చేరుకున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు



పల్లెవెలుగు బేతంచెర్ల ప్రతినిధి (జూన్ 6):--- 2026-27 విద్యా సంవత్సరానికి బేతంచెర్ల మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఈ విషయాన్ని మండల విద్యాధికారి అబ్రహం, సోమశేఖర్ తెలిపారు. మండల అవసరాలకు అనుగుణంగా మొత్తం 39,527 పాఠ్యపుస్తకాలు, 47,645 నోటు పుస్తకాలు అందినట్లు వెల్లడించారు. వీటిని త్వరలోనే సంబంధిత పాఠశాలలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున మొత్తం 7,015 యూనిఫాంలు కూడా వచ్చాయని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# దొండపూడి నేషనల్ హైవే నిర్వాసితుల ఆవేదన, పరిహారం కోసం బాధితుల డిమాండ్

గోపాలపురం ,పల్లె వెలుగు



శనివారం జూన్ 06 :- జాతీయ రహదారి (చీస 365దీడీ) విస్తరణ పనులు అత్యంత నత్తనడకన సాగుతుండటంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా రోడ్డు పక్కన నివసిస్తూ, వ్యాపారాలు చేసుకుంటున్న పలువురు బాధితులు ఈ విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయి జీవనాధారం లేక అల్లాడుతున్నారు. సమీపంలోని ఇతర గ్రామాలకు నష్టపరిహారం అందించిన అధికారులు, దొండపూడి వాసుల విషయంలో తీవ్ర వివక్ష చూపుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ఏప్రిల్ నెలలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టి, వాటిని పూర్తి చేయకుండానే మధ్యలో వదిలేయడం వల్ల భవనాలు, షాపులు దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. తెరిచి ఉన్న డ్రైనేజీ గుంతల కారణంగా వృద్ధులు, చిన్నారులు బయటకు రావాలంటేనే భయపడాల్సిన దుస్థితి నెలకొంది. ఎవరైనా పొరపాటున ఈ గుంతల్లో పడిపోయే ప్రమాదం ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు గ్రామంలోని తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసమవ్వడంతో ప్రజలు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు మరియు నేషనల్ హైవే కాంట్రాక్టర్లు తక్షణమే స్పందించి, ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని, నీటి సమస్యను పరిష్కరించి నిర్వాసితులకు తగిన న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

# స్నేహానికి నిలువుటద్దం, బాల్య మిత్రుల అనుబంధం

తాళ్లరేవు,పల్లె వెలుగు



శనివారం జూన్ 06 :- కాకినాడ జిల్లా తాళ్లరేవులోని నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన 130 మంది విద్యార్థులు నేడు ఆదర్శంగా నిలుస్తున్నారు. కాలంతో పాటు వేర్వేరు ప్రాంతాలకు వెళ్ళినా, స్నేహబంధాన్ని వీడకుండా 60 మంది పూర్వ విద్యార్థులు తరచూ కలుస్తూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఆపదలో ఉన్న మిత్రులను ఆదుకోవడంలోనూ వీరు ముందుంటున్నారు. ఇటీవల మరణించిన మిత్రుడు గుబ్బల శ్రీనివాస్ కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించి, ఆయన కుమార్తె వివాహానికి బాసటగా నిలిచారు. 2026 నవంబరు నుండి వీరు ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల హాజరు పట్టిక ఆధారంగా ప్రతి మిత్రుని పుట్టినరోజును గుర్తిస్తూ, ఎంత దూరంలో ఉన్నా సరే వారి ఇంటికి వెళ్లి వేడుకలు జరుపుతున్నారు. కేకులు కోసి, శాలువాలతో సత్కరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో విత్తనాల సాంబశివరావు, కొల్లు కృష్ణ ప్రసాద్, వాసంశెట్టి శ్రీనివాస్, నెల్లి బ్రహ్మజీ, కాటాడి రమేష్, తొగరు కృష్ణమూర్తి, జగతాని శ్రీనివాస్, పేరూరి శ్రీనివాస్, వూడా రామకృష్ణ, విత్తనాల రామకృష్ణ, అత్తిలి శ్రీనివాస్, సంగాడి కామేశ్వరరావు, గున్నాడ లక్ష్మణరావు, సబ్బతి నరసింహమూర్తి, నరాల సత్తిరాజు, పాలెపు ప్రసాద్, వనమాడి నూకరాజు, మాత ఆంజనేయులు, చెక్క చలపతి, చెక్క సత్యనారాయణ, భూసారపు నాగేశ్వరరావు, బదుగు శరత్, కట్టా శ్రీనివాస్, పోతుల శ్యామ్ సుందర్, సింగవరపు ప్రకాష్ తదితరులు పాల్గొంటున్నారు

# చిన్నారి విజయ గీతిక భవ్య పుట్టినరోజు వేడుకలు, 500 మందికి అన్నదానం




జగ్గంపేట,పల్లె వెలుగు
శనివారం జూన్ 06 :- కాకినాడ జిల్లా జగ్గంపేటలోని ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌లో చిన్నారి విజయ గీతిక భవ్య 4వ పుట్టినరోజు వేడుకలు వినూత్నంగా, సేవా కార్యక్రమాలతో సాగాయి. తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల విభాగం జిల్లా అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, వెంకటలక్ష్మి దంపతుల మనవరాలు, వరుపుల దుర్గాప్రసాద్, సుమారిక దంపతుల కుమార్తె విజయ గీతిక భవ్య జన్మదినాన్ని పురస్కరించుకుని పేదల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహించి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మండపాక అప్పన్న దొర మాట్లాడుతూ తమకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మరియు జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలే స్ఫూర్తి అని పేర్కొన్నారు. చిన్నారులకు చిన్నతనం నుంచే సామాజిక సేవా దృక్పథాన్ని అలవాటు చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. శుభకార్యాలు ఆడంబరాలకు పరిమితం కాకుండా, పేదల ఆకలి తీర్చేలా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఇటువంటి కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు

# రైతు పాస్ పుస్తకాలపై రాజముద్ర, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కిర్లంపూడి,పల్లె వెలుగు శనివారం జూన్ 06 :- కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం శృంగారాయుని పాలెంలో "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పాస్ పుస్తకాలపై నాయకుల ఫోటోలు ముద్రించి వ్యక్తిగత ప్రచారానికి వాడుకున్నారని, నేడు ఆ పరిస్థితికి స్వస్తి పలికి ప్రభుత్వం కేవలం రాజముద్రతో కూడిన పుస్తకాలను రైతుల ఫోటోలతో అందజేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పాస్ పుస్తకం అనేది నాయకుడి ఫోటో ఆల్బమ్ కాదని, ఇది రైతు భూమి హక్కుకు ప్రభుత్వం ఇచ్చే చట్టబద్ధమైన భరోసాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గతంలో బొమ్మలతో భూములకు రక్షణ వస్తుందని భ్రమ కల్పించారని, ఇప్పుడు రాజముద్రతో హక్కుకు భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. ఇది వ్యవస్థల ప్రభుత్వమని, రాజ్యాంగబద్ధమైన రాజముద్రకే ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీరం రెడ్డి కాశి బాబు, తోట గాంధీ, గోడెబాల, బొజ్జపు శ్రీనివాస్, ఎంపీటీసీ గరగ గోవిందు, పట్టు చంటిబాబు, బొజ్జపు నాగేశ్వరరావు, తిరుమల సత్యానంద, అల్లు మల్ల వెంకటేశ్వర్లు, గోడే బాసు, మదుగుల బాబ్జి, అరుణ రాజేష్, ఎస్ తిమ్మాపురం నాయకులు, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల జోరు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు



గండేపల్లి,పల్లె వెలుగు శనివారం జూన్ 06 :- కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులతో పాటు పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పోతుల మోహనరావు తెలిపారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన శనివారం పర్యవేక్షించారు. నేషనల్ ఎగ్ కార్ట్ సంస్థ ద్వారా గండేపల్లికి చెందిన కటకం ధనలక్ష్మికి 100 శాతం సబ్సిడీతో రూ. 50,000 విలువైన ఎగ్ కార్ట్ బాక్స్‌ను పంపిణీ చేశారు. తన షాపు ద్వారా రోజుకు రూ. 1,000 ఆదాయం పొందుతున్నానని లబ్ధిదారు ధనలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో బొల్లంరెడ్డి రామకృష్ణ, వెంపాటి రాజు పాల్గొన్నారు. అనంతరం సింగరం పాలెం గ్రామంలో రూ. 80 లక్షల కేంద్ర నిధులతో పూర్తయిన సిమెంట్ రోడ్డును పోతుల మోహనరావు పరిశీలించారు. రోడ్డు నాణ్యతను స్వయంగా పర్యవేక్షించిన ఆయన, నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో నియోజకవర్గంలో అన్ని రహదారులను సిమెంట్ రోడ్లుగా మార్చుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కిన సుదర్శన్ రావు, అక్కిన నాగేశ్వరరావు, కుక్కల రమేష్, ఈ అప్పన్న పాల్గొన్నారు

# ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రులకు వినతి



విశాఖపట్నం,పల్లె వెలుగు శనివారం జూన్ 06 :- విశాఖపట్నంలో నిర్వహించిన నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్ వర్క్‌షాప్ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్‌లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని ఈ సందర్భంగా వారు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, కార్యదర్శి త్సవటపల్లి నాగభూషణం మరియు కార్యవర్గ సభ్యులు ఈ వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు. ప్రస్తుతం ఆక్వా రైతులు అనుభవిస్తున్న ఇబ్బందులను వివరిస్తూ, ఫీడ్ ధరలు భారీగా పెరగడం మరియు రొయ్యల ధరలు గణనీయంగా తగ్గిపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు పేర్కొన్నారు. దీనికి తోడు నాణ్యమైన సీడ్ కొరత వేధిస్తోందని, ప్రభుత్వం హామీ ఇచ్చిన రూపాయి విద్యుత్ సబ్సిడీ ఇప్పటికీ అమలు కాకపోవడం ఆక్వా రంగాన్ని మరింత కుంగదీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రులు ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించి, ఆక్వా రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత, వాసంశెట్టి నందివర్ధన



తాళ్లరేవు,పల్లె వెలుగు శనివారం జూన్ 06 :- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో కృషి చేయాలని బీమాబాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగిన సమావేశం మరియు ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. పారిశ్రామికీకరణ, ప్లాస్టిక్ వాడకం, చెట్ల నరికివేత కారణంగా భూమి ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నాయని, వీటిని నియంత్రించడానికి తక్షణ చర్యలు అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఝాన్సీ మాట్లాడుతూ గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించి, పర్యావరణ అనుకూల విధానాలను పాటించాల్సిన ఆవశ్యకతను వివరించారు. సామాజిక కార్యకర్త డి అర్జున్ రావు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మరియు ప్రకృతిపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కాలుష్యాన్ని అరికట్టేందుకు విరివిగా మొక్కలు నాటడమే కాకుండా, అవి ఎదిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జి చంద్రకళ కోరారు. ఈ కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# కేజీ బేసిన్ గ్యాస్ వాటాలో రాష్ట్రానికి 50 శాతం వాటా ఇవ్వాలి

తాళ్ళరేవు,(పల్లె వెలుగు శనివారం జూన్ 06 :- చమురు, గ్యాస్ ధరలు పెరిగి మార్కెట్‌లో కొరత ఏర్పడిన నేపథ్యంలో, 12వ ఆర్థిక సంఘం సిఫార్సు ప్రకారం కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో రాష్ట్రానికి 50 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల



నాయకులు శనివారం గాడిమొగలోని గ్యాస్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు, సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్, జిల్లా నాయకులు జేవీ, సిపిఐ(యంఎల్) రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్‌బాబు, సిపిఐ (యంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రామకృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్, శేషుబాబ్జి పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ ఇక్కడ ఉత్పత్తి అయ్యే సహజ వాయువును ఇతర రాష్ట్రాలకు తరలించి లాభాలు గడిస్తోందని, నిత్యం కాలుష్యంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో గ్యాస్ కొరత వల్ల చిరు వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చట్టబద్ధంగా రావాల్సిన వాటా పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు

# పుస్తక పఠనంతోనే ఉన్నత శిఖరాలు, కలెక్టర్ హరేంధర ప్రసాద్


కాకినాడ,పల్లె వెలుగు శనివారం జూన్ 06 :- కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గత 45 రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు




వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ హరేంధర ప్రసాద్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు), గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.జె.ఎస్.ఎల్. కుమారి శిక్షణ పొందిన విద్యార్థులకు, బోధించిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధర ప్రసాద్ మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం ఎంతో అవసరమని, ఇది విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, ఉన్నత లక్ష్యాల సాధనకు మార్గదర్శకమని పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రంథాలయాలను మరింత ఆధునీకరించి, వచ్చే వేసవిలో మరిన్ని విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తామన్నారు. కె.జె.ఎస్.ఎల్. కుమారి మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకున్న అంశాలను నిరంతరం సాధన చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య ఉపసంచాలకులు పసుపులేటి పోసయ్య, ఉప గ్రంథాలయ అధికారి ఇన్ ఛార్జ్ కె. కిషోర్, ఎం. శ్రావ్య, ఎస్. రాజు, టి. సాయి, ఏవీఎస్ నాగేంద్ర కుమార్, వి. అరుణ, ఎన్. వి. ఎస్. ఫణీంద్ర కుమార్, టి. వీర్రాజు, జై దుర్గా ప్రసాద్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి

## నిర్లక్ష్యం, తప్పుడు నమోదులపై కఠిన చర్యలు తప్పవు




☛అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
☛జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాలబ్యూరో చీఫ్ , జూన్ 6 పల్లె వెలుగు






జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులు, బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోల కోసం నిర్వహించిన "ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం" శిక్షణలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ఓటర్ల నమోదు ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల భర్తీ, క్షేత్రస్థాయి ధృవీకరణ విధానాలపై బీఎల్ఓలకు సమగ్రంగా, పూర్తిస్థాయిలో శిక్షణ అందించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.**

**ఎన్యుమరేషన్ ఫారమ్ల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు ఎన్యుమరేషన్ ఫారమ్లు ముందస్తుగా ముద్రించబడి ఉంటాయని, ఖాళీగా ఉన్న వివరాలను మాత్రమే పూరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఫారమ్పై సంబంధిత ఓటరు లేదా ఇంటి పెద్దల సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని, అనంతరం వాటిని డిజిటలైజ్ చేసి డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో నమోదు చేయాలని పేర్కొన్నారు.**

### ఫారమ్ తిరిగి రాకపోతే కారణాలు స్పష్టంగా నమోదు చేయా

ఎన్యుమరేషన్ ఫారమ్లు తిరిగి రాని సందర్భాల్లో కేవలం నాలుగు కారణాలైన ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ అనే వివరాలను మాత్రమే నమోదు చేయాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా బూత్ వారీగా ప్రత్యేక జాబితాలు తయారు చేసి ప్రజల అభ్యంతరాల కోసం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.
బీఎల్ఏలు సమర్పించే ఫారమ్లపై ప్రత్యేక పరిశీలన బూత్ లెవల్ ఏజెంట్లు ( బి ఎల్ ఏ లు) రోజుకు గరిష్ఠంగా 50 ఎన్యుమరేషన్ ఫారమ్లు మాత్రమే సమర్పించగలరని తెలిపారు. వారు అందించే ప్రతి ఫారమ్ను క్షుణ్ణంగా పరిశీలించి సంతకాల ప్రామాణికతను నిర్ధారించాల్సిన



బాధ్యత అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు.
డ్రాఫ్ట్ నుంచి ఫైనల్ రోల్ వరకు కార్యాచరణ షెడ్యూల్ ఖరారు
జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారని తెలిపారు. జూలై 21న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అనంతరం క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పూర్తి చేసి సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

### మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లాలో మొత్తం 14 లక్షల మంది ఓటర్లలో ఇప్పటికే 10 లక్షల మందికి పైగా మ్యాపింగ్ పూర్తైందని, మిగిలిన వారందరి మ్యాపింగ్ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మ్యాపింగ్ సక్రమంగా జరగకపోతే ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో కనిపించకపోవడంతో అనవసర సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.
అవసరమైన సందర్భాల్లోనే డిక్లరేషన్ ఫారమ్ల వినియోగం
ఇప్పటి వరకు మ్యాపింగ్ కాని అర్హుల కోసం మాత్రమే అనెక్సర్-4 డిక్లరేషన్ ఫారమ్ను వినియోగించాలని సూచించారు. వయస్సు, జనన తేదీ ఆధారంగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలించాలని తెలిపారు.

### ఆధార్ గుర్తింపు పత్రం మాత్రమే

ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రంగా మాత్రమే పరిగణించబడుతుందని, అది జనన తేదీ లేదా నివాసానికి పూర్తి ఆధార పత్రం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం సూచించిన ఇతర చెల్లుబాటు అయ్యే పత్రాలను కూడా అవసరానికి అనుగుణంగా పరిశీలించాలని సూచించారు.

### రికార్డుల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత పాటించాలి

ఎవరికి ఫారమ్లు పంపిణీ చేశామనే వివరాలను ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేయాలని తెలిపారు. ఫారమ్లు తిరిగి రాని ఓటర్ల జాబితాలను పంచాయతీ, మున్సిపల్, తహసీల్దార్, ఈఆర్ఓ మరియు కలెక్టర్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

### రాజకీయ ఒత్తిళ్లకు లొంగవద్దు

ఎన్నికల ప్రక్రియలో రాజకీయ ఒత్తిళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ లొంగవద్దని సిబ్బందికి సూచించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే ఏఈఆర్ఓ లేదా జిల్లా అధికారులకు సమాచారం అందించాలని, ఫీల్డ్ స్థాయిలో సిబ్బందికి పూర్తి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.
తప్పుడు నమోదులు, నిర్లక్ష్యంపై కఠిన చర్యలు
ఓటర్ల నమోదు ప్రక్రియలో తప్పుడు వివరాలు నమోదు చేసినా, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినా చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం - 1950లోని సెక్షన్ 31, 32 ప్రకారం జైలు శిక్షలు, జరిమానాలు విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### జూన్ 14 నాటికి వంద శాతం లక్ష్యం సాధించాలి

ప్రత్యేక సర్వే, మ్యాపింగ్, ఫారమ్ల డిజిటలైజేషన్ తదితర పనులను జూన్ 14లోపు వంద శాతం పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
లిఅనంతరం భారత ఎన్నికల సంఘం సరఫరా చేసిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్ ) కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు)కు గొడుగు, క్యాప్ తదితర వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వేలు, ఎన్నికల విధుల నిర్వహణ సమయంలో ఎండ, వర్షాల నుంచి రక్షణ కల్పించడంతో పాటు విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కిట్లు ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, నంద్యాల ఆర్డీఓ మరియు ఈఆర్ఓ విశ్వనాథ్, ఆరు మండలాల తాసిల్దారులు, అన్ని పోలింగ్ స్టేషన్ల బిఎల్ఓలు, పాల్గొన్నారు.

# రైతు డిస్కాం విప్లవాత్మకం





హైదరాబాద్ ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని తీసుకొచ్చి రైతుల జీవితాల్లో వెలుగులు నింపితే...ఈనాడు సీఎం రేవంత్‌రెడ్డి రైతుల కోసం ప్రత్యేక రైతు డిస్కాం ఏర్పాటు చేసి ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారని రైతు సంక్ష్?మ కమిషన్ చైర్మెన్ ఎం కోదండరెడ్డి చెప్పారు. ఈ నిర్ణయంతో కాంగ్రెస్ సర్కారు మోటార్లకు మీటర్లు బిగించబోతుందనేది ప్రతిపక్ష్?ల అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను రాజకీయం చేయడం సరైందికాదని ప్రతిపక్ష్?లను కోరారు. అన్ని పంటలకు మద్దతు నిర్ణయించడం, వాటిని కొనడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్‌భవన్‌లో రైతు కమిషన్ రూపొందించిన పంటల మార్పిడి నివేదికను కమిషన్ సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి, మెంబర్ సెక్రటరీ గోపాల్, స్పెషల్ అధికారి కేశవులుతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే పంటల మార్పిడి అనివార్యమని చెప్పారు. కేరళ, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో అధ్యయనం చేసి పంటల మార్పిడిపై నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మే 4న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో పంటల మార్పిడిపై సుదీర్ఘంగా చర్చించామని గుర్తు చేశారు. ఆ నివేదికను సీఎంకు అందజేశామన్నారు. దీనిపై లోతైన అధ్యయనం చేయాలని సీఎం సూచించినట్లు వెల్లడించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కూడా నివేదికను అందజేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాలు అందుబాటులోకి రాకముందు వర్షాధార, సాంప్రదాయ పంటల సాగు అధికంగా ఉండేదని, కాలక్రమేణా రైతులు వరి, పత్తి పంటల వైపు మొగ్గుచూపారని తెలిపారు. వరి, పత్తి పంటలకు కేంద్ర ప్రభుత్వమే మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ, పత్తి కొనుగోళ్లలో అమలు చేసిన యాప్ విధానం, పంటపై విధించిన ఆంక్షలు, ఎకరానికి ఏడు క్వింటాళ్ల పరిమితి వంటి నిర్ణయాలను ఆయన తప్పుపట్టారు. రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల తోటల సాగు తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. కోతుల బెడద కారణంగా పలు పంటల సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సోలార్ ఫెన్సింగ్, కోతుల కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. వరి, పత్తి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధరలు కల్పించాలని నివేదికలో ప్రతిపాదించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 23 పంటలకు మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ, కేంద్రం వరి, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లకే పరిమితమవుతోందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు, హమాలీల కొరత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ కొనుగోళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు. తాను విద్యుత్ వినియోగం చేసిన వ్యాఖ్యలను కొన్ని పత్రికలు వక్రీకరించాయని, తాను కూడా రైతునేనని, రైతు సమస్యలపై పూర్తి అవగాహనతోనే మాట్లాడుతున్నానని చెప్పారు. కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పంట అవశేషాలను కాల్చవద్దని ప్రభుత్వం, వ్యవసాయ శాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ, రైతులు ఇంకా ఆ పద్ధతిని కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టాలు కూడా చోటుచేసుకుంటున్నాయని హెచ్చరించారు. వర్షాలు కురిసిన తర్వాత పంట అవశేషాలను భూమిలో కలిపి దున్నడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. వరి వ్యర్థాలను కాల్చితే కేసులు నమోదవుతాయన్నారు. అన్ని ప్రాంతాల్లో ఒకే రకమైన పంటల సాగు రైతులకు ప్రయోజనం చేకూర్చదని, కందులు, జొన్నలు, ఇతర పప్పుధాన్యాలు, కూరగాయల సాగు ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశముందని సూచించారు. ఈ పంటలకు గిట్టుబాటు ధర, బోనస్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫార్సు చేసినట్లు తెలిపారు. కోతుల బెడద నివారణకు నాబార్డు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని, రైతుకు లాభం చేకూర్చే విధానాలే వ్యవసాయ భవిష్యత్తును నిర్ణయిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# పోస్టాఫీస్ లో మగ పిల్లల కోసం ప్రత్యేక పథకం




అచ్చంపేట పోస్టాఫీస్ లో 18 ఏళ్ల లోపు బాలుర (మగ పిల్లల) కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతా అందుబాటులో ఉందని పోస్ట్ మాస్టర్ శ్రీకాంత్ తెలిపారు. పిల్లల, తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో పాటు రూ.500 చెల్లించి ఈ ఖాతా తెరవవచ్చన్నారు. ఏడాదికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చని, దీనిపై చక్రవడ్డీ లభిస్తుందని పేర్కొన్నారు. బాలికల పేరుతో సుకన్య సమృద్ధి యోజన ఖాతా ఏ విధంగా ఉంటుందో.. అదేవిధంగా మగ పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం పిపిఎఫ్ ఖాతాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఉన్నత చదువులకు ఈ ఖాతాలో పొదుపు చేసిన డబ్బులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బాలల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన సూచించారు. వివరాలకు స్థానిక పోస్ట్ ఆఫీస్ లో సంప్రదించాలన్నారు.

# మండలంలో ప్రజా పాలన ప్రత్యేక గ్రామసభలు



కమ్మర్ పల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక గ్రామసభను నిర్వహించారుమండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్ అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి రాజా గంగారం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అట్టడుగు వర్గాల ప్రజలకు అందేలా ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మహిళలకు ఉచిత బస్, ప్రతి ఇంటికి ఉచిత కరెంటు, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్నం వడ్లకు బోనస్ లాంటి కార్యక్రమలు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో నిరంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.హాస కొత్తూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ముగింపు గ్రామ సభలో సర్పంచ్ నలిమేల రేవతి గంగారెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన విధానాలను గ్రామ సభకు వచ్చిన గ్రామ ప్రజలకు నిర్వహించారు.ఈ గ్రామ సభల్లో ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్, తహసిల్దార్ నరేష్, వచ్చిన ఎస్ఐ సతీష్, మండల విద్యాధికారి నేర ఆంధ్రయ్య, మండల పంచాయతీ అధికారి సదాశివ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, మండల గ్రామస్థాయి అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ అధికారుల వలలో అవినీతి వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్

నల్లగొండ కలెక్టర్ కార్యాలయం లో ఉన్న సదరు వక్ఫ్ కార్యాలయం లో సోదాలు నిర్వహిస్తున్న చూజదీ అధికారులు.. పెద్దవురా లోని మసీదు కి గల సుమారు 996.33 గజల భూమి గతంలో కొందరు దాతలు ఇచ్చారు అని సమాచారం... భూమి రేట్లు అమాంతం పెరుగుదల కావడం తో కన్నేసిన దాతల వారసులు.. భూమి వక్ఫ్ కి చెందాలి లేదా మసీదు కి చెందాలి అని అన్యాక్రాంతం కావొద్దు అని మసీదు నిర్వాహకుడు వక్ఫ్ బోర్డు కి లేఖ రాసినట్లు సమాచారం.. అయితే వక్ఫ్ బోర్డు వారు సదరు వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ మెహమూద్ కి విచారణ చేయమని తెలుపుగా.. మసీదు నిర్వాహకుడు రిపోర్టు కరెక్టు ఇవ్వాలి అంటే డబ్బులు ఇవ్వాల్సిందే అని ఇన్స్పెక్టర్ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు... ఏసీబీ ని ఆశ్రయించిన బాధితుడు.. విస్తృత తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు..మరి కొద్ది నిమిషాల్లో వివరాలు వెల్లడించనున్న ఏసీబీ డిఎస్పీ.జగదీష్.